చంద్రశేఖర్ ఆజాద్

రచన
మైథిలీ వెంకటేశ్వరరావు

ధర : 50/-

పేజ్ మేకింగ్:
సరస్వతి గ్రాఫిక్స్
విజయవాడ

ప్రథమ ముద్రణ
జూలై 2008

ముఖచిత్రం
రమణ

ఈ పుస్తకం కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. అయినా పొరపాట్లు దొర్లి ఉండవచ్చును. సంవత్సరాల విషయంలో, సంఘటనల విషయంలో, అభిప్రాయ వ్యక్తిత్వ విషయాల్లో పొరపాట్లు రాసి ఉంటే క్షమించగలరు. నాకు తెలిపిన మలిముద్రణలో సవరించగలము.

- మైథిలీ వెంకటేశ్వరరావు

# చంద్రశేఖర్ ఆజాద్



## మైథిలీ వెంకటేశ్వరరావు

సరస్వతీ పబ్లికేషన్ విజయవాడ వారి భారతదేశ

జాతిరత్నాల నుంచి

**మైథిలీ వెంకటేశ్వరరావు రచనలు**
**మహనీయుల జీవిత చరిత్రలు**
**భావి భారతపౌరులకు ఆదర్శప్రాయాలు**
**ఇవే అత్యున్నత స్థాయికి చేర్చే నిచ్చెనలు**

జాతిపిత మహాత్మాగాంధీ
స్వామి వివేకానంద
నేతాజీ సుభాష్ చంద్రబోస్
మదర్ థెరిసా
పండిట్ జవహర్ లాల్ నెహ్రూ
ఇందిరా గాంధీ
డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్
లోకమాన్య బాలగంగాధర తిలక్
లాల్‌బహదూర్ శాస్త్రి
శ్రీ రామకృష్ణ పరమహంస
రాజీవ్ గాంధీ
చంద్రశేఖర్ ఆజాద్







# చంద్రశేఖర్ ఆజాద్

### విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్

భారతదేశ స్వాతంత్ర్యము కొరకు పోరాడిన విప్లవకారులలో ప్రముఖుడిగా చంద్రశేఖర్ ఆజాద్‌ను చెప్పుకోవచ్చు. ఆజాద్ అంటే స్వతంత్రభావాలు కలిగినవాడు. సర్వస్వతంత్రుడు. ఏ పరిస్థితులలోనూ ఎవ్వరికి తలవంచక తాను అనుకున్నది సాధించగలిగే సర్వస్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తి అని. అటువంటి సర్వస్వతంత్రుడు చంద్రశేఖరుడు కాబట్టే అతడిపేరులో ఆజాద్ విలీనమై పోయింది. యావద్భారతదేశంలో విప్లవ పోరాటాన్ని నడిపి చైతన్య జ్యోతిని వెలిగించినవాడు ఈ చంద్రశేఖర్ ఆజాద్.

### జననము

చంద్రశేఖర్ 1906 వ సం॥ జులై నెల 23వ తేదీన సీతారాం తివారి, జగరాణీదేవిలకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూరు జిల్లాయందు 'భాంవరా' అనే గ్రామంలో జన్మించాడు. చంద్రశేఖర్ అని నామకరణం చేసి ఆ దంపతులు ఈ బిడ్డని అతిగారాబంగా పెంచసాగారు. ఈ దంపతులకు మొదట బిడ్డ 'సుఖదేవ్' ఆ తర్వాత ముగ్గురు బిడ్డలు వరుసగా పుట్టినా బాలారిష్టాల కారణంగా వారందరూ మృతిచెందారు.

ఆ దంపతులు ఆ పరిస్థితికి కుమిలిపోతున్న సమయంలో జగరాణీదేవి మళ్ళీ గర్భవతి అయింది. అప్పుడు పుట్టినవాడే చంద్రశేఖర్. సన్నగా, పీలగా పుట్టిన ఆ బిడ్డ తమకు దక్కుతాడో లేడోనని ఎంతో జాగ్రత్తగా పెంచసాగారు. సీతారాం తివారీ ఓ తోటకు కాపలాదారుగా పనిచేస్తుండేవాడు. ఉద్యోగం చిన్నదే అయినా బాధ్యతతో నిర్వహించేవారు. అమితమైన జాలి హృదయం, సత్యసంధతతో ఉండి ఎంతోమందికి ఆపదలో సహాయకారిగా ఉండటంతో ఆ వూరివారంతా అతడిని ప్రత్యేకమైన గౌరవాభిమానాలతో చూసేవారు.

## చలాకీ చంద్రశేఖర్

చంద్రశేఖర్ ఆరోగ్యం మొదట్లో కొంచెం నలతగా ఉండటంతో ఈ బిడ్డకూడా తమకు దక్కుతాడో లేడోనని ఎంతో గాభరా చెందెడివారు సీతారాం తివారీ దంపతులు. ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో ఆ దంపతులు బారసాల వైభవంగా జరిపించలేకపోయారు. తాము తినడం అయినా మానుకొని ఆ బిడ్డకి మంచి ఆహారాన్ని పెట్టేవారు.

వారి శ్రద్ధ కారణంగా చంద్రశేఖర్ అత్యంత తక్కువ సమయంలోనే కోలుకొని బంతిలా తయారయ్యాడు. చంద్రశేఖర్ అన్న సుఖదేవ్ ఆరోగ్యంగానే ఉన్నా మందకొడిగా ఉండేవాడు. చంద్రశేఖర్ మాత్రం అతిచురుగ్గా ఉండేవాడు. వీధిలో పిల్లలతో చలాకీగా ఆటలు ఆడేవాడు. సుఖదేవ్ మాత్రం దూరంగా నిలబడి వీరిని గమనించే వాడేగాని ఆటలలో పాల్గొనేవాడు కాదు.

## నాయకత్వంపై ఇష్టము

చంద్రశేఖర్ స్కూలులోనూ, వీధిలో ఆటలు ఆడేటప్పుడు ఆటలో నాయకుడి పాత్రని ఎక్కువగా పోషించటానికి ఇష్టాన్ని చూపేవాడు. అంత చిన్న వయసులోనే నాయకుడిగా అధికారాన్ని ఎంతో అర్థవంతంగా, సమర్థవంతంగా పోషించేవాడు. ఈ నాయకత్వ లక్షణాలను చూసి సీతారాం తివారి దంపతులు మురిసి పోయేవాళ్ళు.

ఏ ఆటలోనయినా తానే గెలిచేవాడు. ఓటమి పాలవటాన్ని ఇష్టపడేవాడు కాదు. ఆకతాయి పనులకు లెక్క ఉండదు. చంద్రశేఖర్ చేసే చిలిపిపనులనూ, ఆకతాయి చేష్టలనూ చూసి బయట వ్యక్తులు కూడా ముద్దుచేసేవారే కాని మందలించేవారు కాదు. అయితే సీతారాం తివారి ఇతడి ఆకతాయి చేష్టలను చూసి జగరాణీదేవిని అతిగారాబంతో బిడ్డని పాడుచేస్తున్నావని మందలించేవాడు. దాంతో తండ్రి భయం కొద్దిగా ఉండేది చంద్రశేఖర్‌కి.





## సాహసం కలిగిన చంద్రశేఖర్

చురుకుదనానికి మారుపేరుగా తయారయిన చంద్రశేఖర్‌కి తెలివితేటలు, ధైర్యం పాళ్ళు కూడా ఎక్కువే. దూకుడుగా కొన్ని పొరపాట్లు కూడా చేశాడు. జగరాణీదేవి బిడ్డను దగ్గరకు తీసుకున్నా సీతారాం తివారి తీవ్రంగా మందలించేవాడు. ఒక్కొక్కసారి కఠినంగా శిక్షించేవాడు. సాహసాలను అలవోకగా చేసే బిడ్డని జగరాణీదేవి భయంతో అక్కున చేర్చుకొనేది. 'ఎందుకురా ఇంతటి సాహసం చేస్తావు?' అని ప్రశ్నించేది. ముద్దు ముద్దుగా సమాధానం చెప్పడంతో ప్రేమతో అక్కున చేర్చుకునేది. తల్లిప్రేమలో తడిచి హాయిగా నిద్రించేవాడు చంద్రశేఖర్.

ఒకరోజు ఆటలాడుతుండగా ఒక అగ్గిపెట్టెలోని ఒక పుల్లను గీయగా మంట వచ్చింది. ఆసక్తితో రెండింటిని కలిపి గీశాడు. మరింతగా మంట వచ్చింది. జిజ్ఞాసతో అన్నిపుల్లలను కలిపి వెలిగిస్తే ఎంతకాంతి వస్తుందో చూడాలనిపించి ఎడమ చేతిలోకి పుల్లలన్నింటిని పెట్టుకొని వెలిగించాడు.

అంతే ఒక్కసారిగా పుల్లలన్ని వెలగటంతో మంట అంతటా వ్యాపించింది. ఇది చూసి పిల్లలు ఘొల్లున అరవసాగారు. చంద్రశేఖర్ పుల్లల నుంచి వెలువడిన కాంతిని గమనిస్తూ ఆనందపడ్డాడే కాని చేయి కాలిపోతుందని బాధా, భయమూ లేవు. తన ప్రయోగాన్ని చూసి తానే కేరింతలు కొట్టాడు. ఆ తర్వాత ఆ ప్రయోగ ఫలితంగా తల్లి దండ్రుల కంగారు, బాధ చూసి మౌనంగా ఉండిపోయాడు.

## ఫిరంగిపై ఆసక్తి

రోజు రోజుకి చంద్రశేఖర్‌లో సాహసిక ప్రయోగాలపట్ల అమితమైన ఆసక్తి కలుగసాగింది. ఆ సమయంలోనే దీపావళి పండుగ వచ్చింది. టపాకాయిలన్నింటిలో కన్నా ఫిరంగిపై ఆసక్తి కలిగింది. పొడవాటి గొట్టంలో ప్రేలుడు మందును దట్టించి ఒకవైపున మూసివేసి ఆ గొట్టాన్ని రెండోవైపు నుంచి కాల్చితే అది పెద్దశబ్దంతో పేలి దూరాన ఉన్న లక్ష్యాన్ని తాకి తునాతునకలు చేస్తుంది. ఈ ఫిరంగి ఆట అంటే చంద్రశేఖర్ చాలా ఇష్టపడేవాడు.

కాని సీతారాం తివారి ఆ ఆట ప్రమాదకరమైనదని కొనిపెట్టేవాడు కాదు. ఎట్లయినాసరే ఫిరంగి ఆట ఆడాలని, దానికి కావలసిన డబ్బుకోసం అనేక ఉపాయాలను ఆలోచించేవాడు. ఆ సమయంలో చంద్రశేఖర్ చూపు తోటలో పండ్లపై పడినది.

తండ్రి పండ్లను అమ్మి డబ్బు చేయడం చాలాసార్లు గమనించాడు. తండ్రికి తెలియకుండా పండ్లను కోసుకువెళ్ళి అమ్మి డబ్బు ప్రోగు చేయాలనుకున్నాడు. కానీ చంద్రశేఖర్‌కి అది తమ తోట కాదని, తండ్రి పండ్లను అమ్మి యజమానికి డబ్బు ఇస్తున్నాడని తెలీదు. ఆలోచన వస్తూనే ఆచరణలో పెట్టి వచ్చిన డబ్బుతో పటాసుమందు కొని ఫిరంగులు చేసి పేల్చేవాడు. వాటినుంచి వెలువడుతున్న ధ్వనిని, మంటలను చూసి ఆనందించేవాడు.

## పశ్చాత్తాపంతో చంద్రశేఖర్

అయితే కొన్ని రోజులకు సీతారాం తివారి బిడ్డ చేసే దొంగతనాన్ని పసికట్టాడు. ఒకసారి కాపుకాచి పండ్లు కోస్తున్నప్పుడు పట్టుకొని ఇంటికి తీసుకువచ్చి కఠినంగా తిడుతూ కర్ర తీసుకొని ఒళ్ళంతా హూనం అయ్యేలా కొట్టాడు. బిడ్డను కొడుతుంటే చూడలేక బాధతో అడ్డం వచ్చిన జగరాణీదేవి ఒంటిపై కూడ వాతలు తేలాయి. ఈ సంఘటనతో చంద్రశేఖర్‌కి పశ్చాత్తాపం కలిగింది.

ఒకటి తాను చేసినది దొంగతనం, దాని వల్ల తండ్రికి తలవంపులు తీసుకువచ్చాడు. రెండవది – తన కారణంగా తల్లికూడా దెబ్బలు తినవలసి వచ్చింది. దాంతో ఇక ముందెన్నడూ అనాలోచితంగానైనా ఇటువంటి పొరపాటు చేయకూడదని దృఢనిశ్చయం తీసుకున్నాడు చంద్రశేఖర్. చిన్ననాటి నుంచి చంద్రశేఖర్ ఏదన్నా నిర్ణయం తీసుకున్నాడంటే ఎట్టి పరిస్థితులలోను భంగం రానిచ్చేవాడు కాదు.

## విద్యాభ్యాసం

ఇటువంటి చిల్లరమల్లర సంఘటనలతో సీతారాం తివారి చంద్రశేఖర్ ఆలోచనలు మరలించటానికి నిశ్చయించుకున్నాడు. సుఖదేవ్ చంద్రశేఖర్ కన్నా పెద్దవాడయినా బుద్ధిమాంద్యం కారణంగా అతడికి విద్యాభ్యాసం మొదలు పెట్టలేదు. దాంతో చంద్రశేఖర్‌పైకి దృష్టి సారించడం జరుగలేదు. సీతారాం తివారి వెంటనే కుమారులిద్దరినీ ఒకేసారి విద్యాబోధనకు సమాయత్తం చేసి తన చిన్ననాటి మిత్రుడు, ఉపాధ్యాపకుడు అయిన మనోహర్‌లాల్ త్రివేది వద్ద విద్యాభ్యాసానికి చేర్పించాడు.

మనోహర్ లాల్ త్రివేది ఉపాధ్యాయుడిగా మంచి పేరు సంపాదించు కొన్నవాడు. ఆతడి వద్ద విద్య అలవడటమే కాకుండా మంచి క్రమశిక్షణ పిల్లలకు





అలవడుతుందని చెప్పుకొనేవారు. ఎటువంటి వారినైనా తప్పుచేస్తే బెత్తంతో దండించటానికి వెనుకాడేవాడు కాదు. అతడికి మిత్రుడి బిడ్డలయినా, బయట పిల్లలైనా ఒక దృక్పథం ఉంటుంది. ఆతడి మనస్తత్వాన్ని బాగా తెలిసి ఉన్నవాడు కావటంతో సీతారాం తివారి తన కుమారులు ఇద్దరినీ విద్యాబోధనకు మనోహర్ లాల్ వద్ద చేర్పించాడు.

## ఉపాధ్యాయునినే శిక్షించిన చంద్రశేఖర్

సుఖదేవ్, చంద్రశేఖర్ లిరువురూ ఆయన శిక్షణలో నిగ్గుతేలసాగారు. ప్రతివిద్యార్థి అంతర్గతశక్తిని మనోహర్‌లాల్ పరీక్షించేవాడు. చంద్రశేఖర్ యొక్క చురుకుదనాన్ని పసిగట్టిన ఆయన సహజంగానే ఆ బిడ్డపట్ల ఆకర్షితుడై ప్రత్యేకాభిమానాన్ని చూపించేవాడు. అయితే చదువులోగానీ, క్రమశిక్షణలోగానీ పొరపాట్లు చేస్తే కఠినంగా శిక్షించేవాడు. భయంతో, భక్తితో పిల్లలంతా ఆయన వద్ద విద్యను అభ్యసించేవారు.

సీతారాం తివారి తీరిక సమయంలో బడికి వచ్చి మిత్రుడితో మంచీ చెడూ మాట్లాడి వస్తుండేవాడు. ఒకరోజు సీతారాం తివారి బడికి వచ్చాడు. ఆ సమయంలో మనోహర్ లాల్ పాఠం చెబుతున్నాడు.

ఏదో పరధ్యాసలో ఆయన ఆ సమయంలో పిల్లలతో ఒక వాక్యాన్ని తప్పుగా వ్రాయించాడు. వెంటనే ఆ తప్పును గుర్తించి వారిని సరి చేసుకోమన్నాడు, దాంతో పిల్లలంతా రాసినదాన్ని సరిగా దిద్దుకొనసాగారు. చంద్రశేఖర్ మాత్రం ఒక్కసారిగా లేచివచ్చి మాస్టారి బెత్తం తీసుకొని మనోహర్‌లాల్‌ని రెండు దెబ్బలు వేశాడు.

## చంద్రశేఖర్ శిష్యుడవటం అదృష్టం అన్న మాస్టారు

అంతే ఒక్కసారిగా క్లాసులోని పిల్లలంతా బిత్తరపోయి చూశారు. మనోహర్‌లాల్‌ది అదే పరిస్థితి. బయటనుంచి వీరిని గమనిస్తున్న సీతారాం తివారి ఒక్కసారిగా బిగుసుకుపోయాడు.

క్షణాలలో తేరుకుని పరుగున లోపలికి వెళ్ళి ఆ బెత్తం తీసుకొని చంద్రశేఖర్‌ని దండించబోయాడు సీతారాం తివారి. చంద్రశేఖర్‌లో ఎటువంటి తడబాటు లేదు. దండించబోయిన సీతారాం తివారిని గట్టిగా పట్టుకొని ఆపాడు మనోహర్ లాల్. వారిని చూస్తూ చంద్రశేఖర్ “మేం తప్పు చేస్తే గురువుగారు మమ్మల్ని దండించవచ్చుగాని ఆయన తప్పు చేస్తే మేము కొట్టకూడదా” అని అడిగాడు.

చంద్రశేఖర్ మాటలకి గురువుగారికి కోపం రాకపోగా మొహంలో చిరునవ్వు తాండవించింది. చంద్రశేఖర్ సునిశితత్వాన్ని, మెచ్చుకున్న ఆయన "మిత్రమా! చురుకుదనము, తెలివితేటలు గల విద్యార్థులకు విద్యని బోధించేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలని నీ బిడ్డ వలన గ్రహించాను. తెలివితేటలతో పాటు విచక్షణాజ్ఞానమూ, వాదనాశక్తీ, సాహసమూ కలగలిసిన చంద్రశేఖర్ వంటి శిష్యుడు నాకు లభించినందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను, నా అదృష్టంగా భావిస్తున్నాను" అని అన్నారు.

## భిన్న దృక్పథాలు

ఉపాధ్యాయుని చేతనే ప్రశంసించేలా ప్రవర్తించిన చంద్రశేఖర్‌ను చూసి మురిసిపోయాడు తండ్రి. సుఖదేవ్‌పై ఎటువంటి ఆశలేని సీతారం తివారీకి చిన్నకొడుకుపై ఆశ చిగురించసాగింది. తన ఆశలు నెరవేర్చేవాడు చంద్రశేఖరుడే అవుతాడనే ఆశలు పెంచుకున్నాడు.

సీతారాం తివారికి తన బిడ్డ సంస్కృతాన్ని బాగా చదివి వేదాలను వల్లెవేసే మహా విద్వాంసుడవ్వాలని, తన వంశప్రతిష్ఠను నలుదిక్కులా చాటాలని కాంక్ష. చంద్రశేఖర్‌పై ఆశలను పెంచుకున్న సీతారాం తివారీ తన కోరికనూ, ఆశనూ భార్యతో చెప్పి మురిసేవాడు. తనొకటి తలిస్తే దైవమొకటి తలుస్తుంది అన్న విధంగా సీతారాం తివారీ ఆలోచనలు ఈ విధంగా ఉంటే చంద్రశేఖర్ ఆలోచనలు వేరొకవిధంగా ఉన్నాయి.

## విలువిద్యను నేర్చిన చంద్రశేఖర్

చంద్రశేఖర్‌పై ఉన్న అభిమానాన్ని మరింతగా పెంచుకున్న మనోహర్‌లాల్ అతడిని ప్రత్యేక శిష్యుడిగా వ్యవహరిస్తూ ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన చేసేవాడు. చంద్రశేఖర్ కూడా అత్యంత ఆసక్తితో, శ్రద్ధతో విద్యను అభ్యసిస్తూ అందరికంటే ముందుండేవాడు. అయితే చంద్రశేఖర్‌కి చదువుకునే పాఠాలు కంఠతా ఉన్నా కూడా ఏదో అసంతృప్తి మనసులో తారట్లాడుతుండేది. ఏదో తపన, ఆరాటం మరేదో తెలుసుకోవాలనే తాపత్రయం కలుగుతూ ఉండేది.

స్నేహితులతో సాహసోపేతమైన ఆటలు ఆడేటప్పుడు మనసుకెంతో ఆహ్లాదంగా, తృప్తిగా ఉండేది. శరీరం విపరీతమైన ఉత్సాహంతో పరవళ్ళు తొక్కేది. స్నేహితులతో కలిసి దగ్గరిలోని అడవిలోకి వెళుతుండేవాడు. ఒకనాడు వారికి అడవిలోని ఆటవికులతో పరిచయం ఏర్పడింది. వారు ప్రదర్శించే విలువిద్యను ప్రీతితో నేర్చుకున్నాడు.





కొద్దిసమయములోనే లక్ష్యాన్ని గురిచూసి కొట్టడం నేర్చుకున్నాడు. అతడి విద్యను చూస్తున్న స్నేహితులు కూడా ఆతడి చాతుర్యానికి మెచ్చుకొని ప్రోత్సాహాన్ని అందించేవారు.

## క్రొత్త విశేషాలు, ప్రదేశం పట్ల ఆసక్తి

దొంగ – పోలీసు ఆటలో తన చాకచక్యాన్నంతా చూపించేవాడు. చంద్రశేఖర్ పోలీసుగా ఉంటే ఎక్కడున్నా దొంగను క్షణంలో పట్టుకొనేవాడు. అదే దొంగ అయితే ఎవ్వరికీ దొరకకుండా తప్పించుకొనేవాడు.

ఆటలలో, సాహసిక కార్యక్రమాలలో ఆనందం దొరకడంతో కొన్నిసార్లు బడి ఎగ్గొట్టి స్నేహితులతో కలిసి అడవిలోకి వెళ్ళిపోయేవాడు. అతడి మనసు ఎప్పుడూ క్రొత్త విషయాలనూ, క్రొత్త ప్రదేశాలనూ, క్రొత్త పరిచయాలనూ కోరుకునేది. ఆ వాంఛ రోజురోజుకి పెరగసాగింది.

సాంఘిక కార్యక్రమాలపై ఆసక్తి కనబరిచేవాడు. ఏది చేసినా ఏదో ఒక సాహసం అతడి పనిలో కనిపించేది. సామాన్యమైన ఆలోచనలు అతడిలో ఏ కోశానా కనిపించేవి కావు. తండ్రి చెప్పే సంస్కృతం పట్ల అసలు ఆసక్తే ఉండేది కాదు. సంస్కృతం నేర్చుకొని, వేదాలు పఠించి ఉద్యోగం చేయాలనే తండ్రి ఆలోచనను ఆతడి మనసు ఏమాత్రం ఒప్పుకునేదికాదు.

ఆ ప్రాంతాన్ని వీడి దూరప్రాంతాలకు వెళ్ళిపోదామని అనుకునేవాడు. ఇతడిలోని మార్పుని గురువుగారూ, తండ్రీ పసిగట్టినా మందలిస్తే మరీ మొండికేస్తాడని చిన్నగా మార్చాలని అనుకున్నారు.

మిత్రులిద్దరూ కలిసి చంద్రశేఖర్ గూర్చి తీవ్రంగా ఆలోచన చేసి అతడిని ఏదన్నా ఉద్యోగంలో పెడితే ఒక వ్యాపకంగానూ ఉపయోగపడుతుందని, ఆర్థికంగా కుటుంబానికి అవసర పడుతుందని అభిప్రాయపడ్డారు.

సీతారాం తివారి తనకున్న మంచిపేరుతో ఏదో విధంగా 'అలీరాజాపూర్' తాలూకా ఆఫీసులో ఒక చిన్న ఉద్యోగాన్ని చంద్రశేఖర్‌కి ఇప్పించగలిగాడు. చంద్రశేఖర్‌లో తెలివితేటలూ, చదువూ ఉన్న ఆతడికి ఇంగ్లీషు అంతగా రాదు. అప్పట్లో బ్రిటీష్ పరిపాలన ఉండటంతో ఇంగ్లీషు తెలియటం ఒక ప్రత్యేక అర్హతగా పరిగణించేవారు.

తండ్రి బలవంతంతో, తల్లి కోరికతో ఆ చిన్న ఉద్యోగంలో బలవంతంగా చేరాడు చంద్రశేఖర్. మనసులో అయిష్టత కారణంగా ఉద్యోగబాధ్యతను

విసుగుతో నిర్వహించేవాడు. బానిసగా బ్రతుకుతున్న తనకు ఎప్పుడు విమోచన కలుగుతుందోనని ఎదురు చూస్తుండేవాడు.

చంద్రశేఖర్‌కున్న మంచి అలవాట్లలో పుస్తకపఠనం ఒకటి. పుస్తకాలలో పలు ప్రదేశాల గూర్చి తెలుసుకునేవాడు. అతడికి బొంబాయి నగరం పట్ల మక్కువ కలిగి ఉండేది. బొంబాయితోపాటు పలు ప్రదేశాలు తిరిగి చూడాలనే భావనతో ఉండేవాడు.

## బొంబాయి నగరంపై ఆసక్తి

ఒకరోజు ఏదో పనిమీద బొంబాయి నుండి ఒక ముత్యాల వర్తకుడు చంద్రశేఖర్ పనిచేసే తాలూకా ఆఫీసుకు రావటం జరిగింది. చంద్రశేఖర్‌తో పరిచయం కూడా జరిగింది.

ఆ వర్తకుడు వ్యాపారరీత్యా ఎక్కువగా ఆఫీసుకి వస్తుండటంతో చంద్రశేఖర్‌కు అతడితో పరిచయం ఏర్పడింది. వారి మాటల మధ్యలో ఆ యువకుడు ఒకసారి బొంబాయి నగరం గురించి చెప్పినప్పుడు చంద్రశేఖర్‌లో ఆసక్తిని గమనించాడు.

తన పనిని పూర్తి చేసుకునేందుకు బొంబాయి నగరం గూర్చి, విశాలమైనదని ఆసక్తికరమైన విశేషాలను, వినోదాలకు బొంబాయి నగరం నిలయం అని ఆకర్షణీయమైన మాటలతో వివరించేవాడు. చంద్రశేఖర్‌కి బొంబాయిపై ఉన్న ఆసక్తి ఈ వర్తకుడి షోకు మాటలతో మరింత ఉధృతమైంది.

## బొంబాయి వెళ్ళాలనే నిర్ణయం

విలాసాలకీ, వినోదాలకీ, సాహసాలకీ నెలవైన బొంబాయి నగరంలో సమర్ధవంతులైన వారికి ఆకర్షణీయమైన వేతనాలతో చక్కటి పనులు దొరుకుతాయనేది చంద్రశేఖర్ ఆ వర్తకుడి ద్వారా తెలుసుకున్న విషయం.

ఇంకా లక్షలాదిమందికి ఆశ్రయమిస్తున్న బొంబాయి నగరంలో ఆసక్తికరమైన విషయాలకీ, వింతలకీ కొదువ ఉండదు. ఉద్యోగమనే బానిసత్వంలో ఉంటూ చిన్న పల్లెటూరిలో జీవనాన్ని సాగించే చంద్రశేఖర్‌కి బొంబాయి నగరం ఆకాశంలో నక్షత్రాలవలే ఆకర్షించసాగింది.

సాహసమే ఊపిరిగా ఉండే చంద్రశేఖర్‌కి బొంబాయి నగరం వెళితే వచ్చే పరిణామాల గూర్చి ఇసుమంతైనా భయం లేదు. బొంబాయి వెళ్ళాలనే ఆసక్తి కాస్తా నిర్ణయంగా మారిపోయింది.





## బొంబాయి ప్రయాణం

బొంబాయి వెళ్ళాలనే నిర్ణయాన్ని తల్లిదండ్రులు ఖచ్చితంగా వ్యతిరేకిస్తారనే నమ్మకం. వారి వద్ద విషయాన్ని దాచాడు. బొంబాయి వెళ్ళటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. ముత్యాల వర్తకుడు పనిమీద వచ్చి ఆఫీసులో పని ముగించుకొని తిరుగు ప్రయాణం పెట్టుకున్నాడు. వర్తకుడితో మాటలు చెబుతూ రైల్వేస్టేషనుకు అతడితోపాటు వెళ్ళాడు. ఆ వర్తకుడికి చంద్రశేఖర్ బొంబాయి తనతో వస్తున్నాడని అర్థమయింది. మాయా నగరమైన బొంబాయిలో అతడు ఎటువంటి కష్టాలు పడతాడోనని బాధపడ్డాడు.

అయితే తాను చెప్పినవన్నీ అబద్ధాలని చెప్పే ధైర్యం అతడిలో ఏకోశానా లేదు. దాంతో మారు మాట్లాడలేకపోయాడు. చంద్రశేఖర్ కూడా ఆ వర్తకుడితోపాటు టిక్కెట్టు తీసుకున్నాడు. పుట్టిన తరువాత మొదటిసారిగా 'భాంవరా' గ్రామాన్ని వదలి బయట ప్రపంచంలోకి అడుగువేశాడు – అదీ తల్లిదండ్రులకు తెలియకుండా.

## బొంబాయిలో ఒంటరిగా

వర్తకుడితో పాటే రైలెక్కిన చంద్రశేఖర్ మనసు బొంబాయి నగరాన్ని ఎప్పుడు చూస్తానా అని ఆదుర్దాపడసాగింది. భాంవరా నుంచి బొంబాయి నగరం దగ్గరనే చెప్పవచ్చు. చంద్రశేఖర్‌తోపాటుగా వచ్చిన వర్తకుడు బొంబాయి స్టేషన్‌లో అతడితో పాటు దిగాడు. కానీ స్టేషను బయటకు వచ్చేసరికి హఠాత్తుగా మాయం అయ్యాడు. ఏదన్నా పనిమీద వెళ్ళాడేమోనని అతడికోసం చాలాసేపు నిరీక్షించాడు.

వర్తకుడు రాకపోవటంతో ఒంటరిగా స్టేషను నుండి బయటకు కాలుపెట్టాడు. ఆ మహానగరంలోకి ప్రవేశిస్తూంటేనే చంద్రశేఖర్ ఒళ్ళు ఒక్కసారిగా జలదరించింది. ఒంటరితనం ఒక కారణమయితే, భవిష్యత్తు ఏ విధంగా ఉంటుందోనని మరొక కారణం.

అయితే ఆ భయం క్షణికమే అయింది. చంద్రశేఖర్‌లోని సాహసికుడు బయటకు వచ్చాడు. నగరంలోకి ప్రవేశించిన చంద్రశేఖర్ వీధులన్నీ తిరుగుతూ రంగురంగుల క్రొత్త ప్రపంచాన్నీ, ఆకర్షణీయమైన వాతావరణాన్నీ ఆస్వాదించాడు. జనం ఉరుకులు పరుగులతో తిరగటాన్ని గుర్తించాడు. పలకరించేవాడు కనుచూపుమేరలో కనిపించలేదు.

## నగరంలో వాతవరణం

రంగురంగుల ప్రపంచం ... ఎత్తయిన మేడలతో, ఖరీదైన వాహనాలతో, విచిత్రమైన వేషధారణ కలిగిన జనాలతో కిటకిటలాడిపోతోంది. నోరూరించే తినుబండారాలు, ఆధునికమైన హోటళ్ళు, ఫ్యాషన్ దుస్తులతో ఆడవారు, రకరకాల వ్యాపారాలతో, అనేకరకాల మోసాలతో, మరెన్నో రకాల ఆకర్షణలతో బొంబాయి నగరం కళ్ళు చెదిరే అందంతో మెరిసిపోతోంది.

చంద్రశేఖర్ అన్నింటిని గమనిస్తూ తిరిగి తిరిగి సముద్రతీరం చేరుకున్నాడు. అప్పటికే శరీరం ఆకలితో, అలసటతో విశ్రాంతిని కోరుకుంటోంది. నీరసంతో ఒక చెట్టునీడన చతికిలబడ్డాడు. దూరాన ఉన్న మనుషులనీ, సముద్రంలో తిరుగుతున్న నౌకలనూ చూస్తూ కాలాన్ని గడపసాగాడు. సమయం గడుస్తున్న కొద్దీ ఆకలి పెరగసాగింది. జేబులో పైసా లేదు. ఆకలిని తీర్చుకునే మార్గం ఆలోచింపసాగాడు.

## చంద్రశేఖర్‌కు లభించిన అవకాశం

అయితే అనుకోకుండా ఆ అవకాశం అతని వద్దకే వచ్చింది. అతడికి దగ్గరలో కొంతమంది పనివారు పడవలకు రంగులు వేస్తున్నారు. కాంట్రాక్టరు దగ్గరుండి పని చేయిస్తున్నాడు. ఆ రోజే పనిపూర్తి చేయవలసి ఉండటం వలన కూలీలు ఎక్కువమంది అవసరమవటంతో అతడు ఆతృతపడుతున్నాడు. ఆ సమయంలోనే అతడికి ఖాళీగా కూర్చొని వీరి వైపే చూస్తున్న చంద్రశేఖర్ కనిపించాడు. చూడగానే సహజంగానే ఆకర్షించే చంద్రశేఖర్ ఆ సమయంలో ఆ కాంట్రాక్టర్‌ని మరింతగా ఆకర్షించాడు. వెంటనే అతడు ఒక కూలీకి ఏదో చెప్పి చంద్రశేఖర్ వద్దకు పంపాడు.

అతడు "పడవకు రంగువేసే పని ఉన్నది ఆ పని చేస్తే డబ్బులిస్తారు. చేస్తావా?" అని అడిగాడు. తాను వెతకాలనుకునే పని తన వద్దకే వెతుక్కుంటూ రావటంతో చంద్రశేఖర్ ముఖం ఆనందంతో మెరిసిపోయింది. వెంటనే అంగీకారం తెలిపి పని తెలుసుకొని పనిలోకి దిగిపోయి చాకచాక్యంతో పనిని పూర్తిచేశాడు.

## ఆకలిని తీర్చిన ఆదాయం

అతడి పనితనాన్ని చూసి కాంట్రాక్టరు ఆశ్చర్యపోయాడు. ఎంతో అనుభవంతో చేయగలిగే పనిని అతడు సునాయాసంగా చేయటం చూసి





ప్రతిరోజు పనిలోకి వచ్చినా తనకు అభ్యంతరము లేదని తెలిపాడు. సాయంత్రానికి పనికి తగిన ధనాన్ని అందుకున్నాడు. ఆకలి తీర్చే సంపాదన ఎంతో ప్రియంగా అనిపించింది.

కూలీలతో పాటే వెళ్ళి భోజనం చేసి వారు పడుకున్న చోటే రాత్రంతా తలదాచుకున్నాడు. తర్వాత రోజునుంచి వారితోపాటు నావలకు మరమ్మత్తులు చేయటం, రంగులు వేయటం చేయసాగాడు. వచ్చిన డబ్బుని కొంత భోజనానికీ, అవసరాలకీ ఖర్చుచేసినా కొంత ధనాన్ని దాచసాగినాడు.

స్వేచ్ఛగా జీవనాన్ని సాగిస్తున్నా ఎటువంటి దురలవాట్లకు అలవాటు పడలేదు. తన చుట్టూ ఉన్నవారిలో వ్యసనాలకు బానిసలయ్యే వారికి అది తప్పని నెమ్మదిగా విశదపరిచేవాడు.

## బొంబాయి నగరంపై జుగుప్స

ఎటువంటి హద్దులూ, అధికారాలూ, బంధాలులేని చంద్రశేఖర్ స్వేచ్ఛాయుత జీవనాన్ని సాగిస్తూ జీవనాన్ని గడపసాగాడు. అతడిలో ఒక ప్రశ్న తరుచుగా తలెత్తేది. 'తను కోరుకున్న స్వేచ్ఛా జీవితం, ఆశపడిన జీవితంఇదేనా!?' అని మనసు ప్రశ్నించేది. దానికి సమాధానం 'కాదు' అనే వచ్చేది. కానీ ఏది తనకు కావాలో తెలియని, తెలుసుకోలేని వయసు, తాపత్రయపడే వయస్సు, నావ పనే కాక అనేక పనులను చేసేవాడు చంద్రశేఖర్.

ఆ కారణంగా అతడికి ఎంతో మంది యువకులతో పరిచయాలు ఏర్పడ్డాయి. డబ్బుని వ్యసనాలకు ఖర్చు చేసేవారికి అది తప్పని, వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలవుతారని నచ్చచెప్పేవాడు. జరుగుతున్న మోసాలు, తళుకుబెళుకులకు మోసపోతున్న యువతను చూచి వారిని మార్చటానికి ప్రయత్నించేవాడు.

యువకులు చెడుదారి పడితే దేశం ఎటుపోతుందోనని కలత చెందేవాడు. రాను రాను అతడికి బొంబాయి వాతావరణంపై జుగుప్స కలగసాగింది. మనసు వైరాగ్యంగా మారసాగింది. బొంబాయి నగరాన్ని వదలివెళ్ళాలనే నిర్ణయం బలపడసాగింది.

## నగరం వీడి కాశీకి చేరిన చంద్రశేఖర్

దాచుకున్న డబ్బు ఆ నిర్ణయాన్ని మరింత బలోపేతం చేసింది. కాళ్ళు రైల్వేస్టేషను వైపుకి అడుగులు వేశాయి. అనాలోచితంగా అక్కడ ఆగి ఉన్న రైలును ఎక్కాడు. టిక్కెట్టు తీసుకోవాలన్న ఆలోచన కూడ అతడిలో లేదు. ఆ

రైలు నెమ్మదిగా బయలుదేరి వేగంగా కాశీ చేరుకుంది. అదృష్టం టిక్కెట్టు కలెక్టరు అతడికి తారసపడలేదు.

కాశీ చేరుకున్నానని అర్థంచేసుకున్న చంద్రశేఖర్‌కి తండ్రి మదిలో మెదిలాడు. తండ్రికి తనను వేదం చదివించాలనే ఆశ. కాశీ పూర్వకాలం నుండీ విద్యాభిక్షకు, వితరణలకు బ్రహ్మాండమయిన పేరు గాంచి ఉంది. తాను సరియైన సమయంలో సరిఅయిన ప్రదేశానికే వచ్చానని భావించాడు. కాశీవిశ్వేశ్వరుడి దర్శనాన్ని భక్తితో చేసుకొన్నాడు.

## సంస్కృత భాషపై పట్టును సాధించిన చంద్రశేఖర్

తండ్రి కోరిక నెరవేర్చాలనే కోరిక మనసులో బలంగా రూపుదిద్దు కోవడంతో ఉన్నత విద్యను బోధించే ఉచిత విద్యాలయం గూర్చి పలుచోట్ల విచారించి తెలుసుకున్నాడు. కాశీలో ఉచితవిద్య, ఉచిత భోజనానికి కొదువలేదు. తండ్రి ద్వారా ఈ విషయం అంతకుపూర్వమే తెలిసి ఉండటంతో అతడి పని సులువు అయింది.

ఉన్నతమైన విద్యాలయాన్ని ఆశ్రయించి ప్రవేశార్హతను సంపాదించు కున్నాడు. సంస్కృతం చక్కగా బోధిస్తున్న గురువులని చూసి అత్యంత ఆనందాన్ని అనుభవించాడు. తండ్రి కోరిక నెరవేర్చాలనే పట్టుదలతో, శ్రద్ధతో విద్యను అభ్యసించసాగాడు. తెలివితేటలు కలిగిన చంద్రశేఖర్ మనసును శ్రద్ధతో కేంద్రీకరించటం వలన విద్యాభ్యాసం ఎటువంటి ఆటంకం లేకుండా జరగసాగింది.

గురువులు చెప్పిందే కాకుండా లైబ్రరీలలో మంచిపుస్తకాలను కూడ చదవసాగాడు. సంస్కృతం బాగా అభ్యసించి అష్టాధ్యాయి, లఘుకౌముది, అమరకోశం వంటివి వంట పట్టించుకున్నాడు. భాషను అవగాహన కల్పించు కోవడంతోనే సరిపెట్టుకోక సంస్కృతభాషా గ్రంథాలను గ్రంథాలయాలలో సేకరించి చదివేవాడు.

## జాతీయ భావంతో చంద్రశేఖర్

జిజ్ఞాస అనే దానికి అంతం అనేది ఉండదు. చంద్రశేఖర్‌లోని జిజ్ఞాస మంచి గ్రంథాలు, పుస్తకాలు చదవటానికి తోడ్పడింది. రామాయణ, మహాభారతంవంటి పురాణగ్రంథాలను చదవటంతోపాటుగా పరిస్థితులను విశ్లేషించి అర్థాన్ని అవగతం చేసుకునేవాడు.





ఆ గ్రంథాలలోని వీరుల సాహసాలనూ, భావాలనూ ఆకళింపు చేసుకున్నాడు. పత్రికా పఠనం ద్వారా దేశంలో పరిస్థితులపై అవగాహన కల్పించుకున్నాడు. అప్పుడు మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయం కావటంతో వాతావరణం వేడిగా ఉంది. స్వాతంత్ర్య పోరాటము, జాతీయ భావం మదిలో మెదిలింది. దేశంలో జరుగుతున్న పరిణామాలు మనసుని కలచివేయసాగేవి.

## అప్పటి భారతదేశ పరిస్థితి

ఆ సమయంలోనే భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటం ముమ్మరం అయింది. కారణం – బ్రిటీష్ వారు మాటను తప్పడం. మొదటి ప్రపంచ యుద్ధంలో గనుక భారతీయులు సహకరిస్తే వారికి స్వాతంత్ర్యం ప్రకటిస్తామని బ్రిటీష్ అధికారం మాట ఇచ్చింది. కానీ సహకారం అందించినా భారతీయులకు మొండి చేయి చూపింది బ్రిటీష్ ప్రభుత్వం. ఈ నమ్మకద్రోహానికి గాంధీజీ దిగ్భ్రాంతి చెందారు.

మోహన్‌లాల్ కరంచంద్ గాంధీ తన విశ్వరూపాన్ని బ్రిటీష్‌వారిపై నిరసనద్వారా తెలియచేసారు. బ్రిటీష్ వారికి గుణపాఠం చెప్పే ప్రయత్నంలో అపూర్వమైన ఉద్యమాన్ని ప్రారంభించారు. 1921వ సం॥లో విదేశీ వస్తు బహిష్కరణకు బహిరంగంగా దేశవ్యాప్తంగా పిలుపును ఇచ్చారు. గాంధీజీ నోటివెంట ఆ మాట వస్తూనే దేశవ్యాప్తంగా మహోద్యమం మొదలైనది.

## 'వందేమాతరం' నినాదాలు

విదేశీ వస్త్రాలను ధరించటం వల్ల చేనేత పరిశ్రమ దెబ్బ తింటుందని, తత్కారణంగా చేనేత పరిశ్రమను నమ్ముకుని బ్రతుకుతున్న అనేకమంది భారతీయులు కరువుతో అలమటిస్తారని ప్రజలకు తెలుపుతూ విదేశీ వస్త్ర బహిష్కరణ చేయాలని గాంధీజీ కోరారు. వేలు, లక్షలు ఖరీదు చేసే వస్త్రాలను కుప్పలుగా పోసి వీధులలో తగలపెట్టారు భారతీయులు.

విదేశీవస్తు, వస్త్ర బహిష్కరణ దేశమంతా వ్యాపించి బ్రిటీష్ ప్రభుత్వంపై తీవ్ర నిరసన దేశవ్యాప్తంగా ప్రకటితమైంది. "వందేమాతరం", "భారతమాతకు జై'', అనే నినాదాలు ప్రతి ఒక్కరి నోటివెంట రామనామ జపంలా వినిపించసాగాయి. ఈ దేశభక్తి విద్యార్థులలో మరింత చైతన్యం రగిలించింది. విద్యార్థిలోకం పూర్తిగా ఉద్రేకంతో కదలిపోయింది. ప్రతి ఒక్కరు విదేశీ వస్త్రాలను

బహిష్కరించి ఖద్దరు వస్త్రాలను ధరించసాగారు. ఊరేగింపులూ, ఉద్యమాలూ, దేశవ్యాప్తంగా జరిగాయి.

## విద్యార్థి నాయకుడిగా చంద్రశేఖర్

చంద్రశేఖర్ కాశీలో ఉద్యమాలను గమనించాడు. అప్పటికే దేశ పరిస్థితుల పట్ల అవగాహన ఉండి ఉండటంతో మరింతగా మనసు చలించసాగింది. అతికొద్ది సమయంలోనే చంద్రశేఖర్ మానసికంగా దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాటం సల్పటానికి ఉగ్రరూతలూగిపోయాడు. ఏ విషయాన్నైనా చిటికెలో అల్లుకుపోయే గుణం కలిగి ఉన్న చంద్రశేఖర్ ఈ విషయంలో మరింత చతురతను చూపించాడు. ఫలితం అతి త్వరలో విద్యార్థి నాయకుడైయ్యాడు.

సింహ కిశోరంలా గర్జించాడు. గాంధీజీపై గౌరవంతో, దేశముపై భక్తితో విద్యార్థులందరినీ ఒక తాటిపైకి తెచ్చి నాయకత్వం వహిస్తూ ఉద్యమాన్ని ప్రారంభించాడు. మాతృదేశ దాస్యవిముక్తి ఆవశ్యతను తెల్పి ఉద్యమాన్ని సముద్రపు హోరులా సాగించాడు. సింహగర్జనలా అతను చేస్తున్న వందేమాతరం నినాదం విద్యార్థులలో కరెంటులా వ్యాపించి వారినుండి బ్రిటీష్ అధికారులకు తగిలేలా చేసింది. పదిహేనేళ్ళ వయసులో కుర్రవాళ్ళు చూపుతున్న దేశభక్తికి అంతా ఆశ్చర్యంతో, ఆనందంతో పొంగిపోయారు.

## వందలసంఖ్యలో దేశభక్తులను తయారుచేసిన చంద్రశేఖర్

పసితనంలోనే విద్యార్థులు చూపుతున్న దేశాభిమానం, బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదిరిస్తున్న వారి ధైర్యం చూచి కొంత మంది పెద్దలు తమ పిరికితనాన్ని బయటకు నెట్టి ఉద్యమంలో కాలుమోపితే మరికొందరు వారి నుంచి దూరంగా జరిగారు. ఇళ్ళలోని స్త్రీలు ఎంతో చైతన్యం చెంది ఇంటిలో మగవారిని కూడా ప్రజా ఉద్యమంలో పాల్గొనమనటమే కాకుండా వారుకూడా పాల్గొనటానికి ముందుకు వచ్చారు.

విదేశీ వస్తువులను కొనటానికి వచ్చేవారికి వాటిని కొనటం వలన విదేశానికి ఎంత డబ్బు తరలిపోతుందో, భారత చేనేత దారులకు ఎంత నష్టం వాటిల్లుతోందోనని ఆ స్త్రీలకు వివరించి వారిచేతనే పలుమందికి వివరణను ఇచ్చేలా చేయసాగాడు చంద్రశేఖర్. వేలఖరీదైన వస్త్రాలను గుట్టలుగా పోసి నిప్పంటించే సమయంలో చంద్రశేఖర్ హృదయం తృప్తితో నిండిపోయేది.





చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దేశభక్తులు వందల సంఖ్యలో పోగయి ఊరేగింపులో పాల్గొనసాగారు.

## పోలీసులను గాయపర్చిన చంద్రశేఖర్

ఒకనాడు ఉద్యమాన్ని వందలమందితో భారీగా నిర్వహించసాగాడు చంద్రశేఖర్. యువకిశోరాలు వందేమాతరం, భారతమాతకుజై, విప్లవం వర్ధిల్లాలి అనే చంద్రశేఖర్ నినాదాలను ఉత్సాహంతో, భక్తితో తిరిగి నినాదాలు చేయసాగారు.

హఠాత్తుగా అక్కడికి వచ్చిన పోలీసుబృందం నినాదాలు చేస్తున్న యువకులపై దాడిచేసి విచక్షణారహితంగా వారిని లాఠీలతో గాయపరచసాగారు. చంద్రశేఖర్‌పై దాడి మూకుమ్మడిగా జరిగింది. అయినా చంద్రశేఖర్ ఇసుమంతకూడా చలించకుండా అందరినీ ధైర్యంగా ఉండమని, క్రమశిక్షణను తప్పకూడదని, దేశభక్తి నినాదం ఆపకూడదని ప్రకటిస్తూ ముందుకు సాగాడు.

ఈ దృశ్యాన్ని గమనించిన పోలీసుల ఆగ్రహం తీవ్రస్థాయికి చేరి విద్యార్థుల రక్తాన్ని కళ్ళచూడసాగారు. బాలురు గాయాలతో శరీరాలు రక్తసిక్తమై స్పృహ తప్పి పడిపోసాగారు. ఈ దృశ్యం చూస్తూ చంద్రశేఖర్ హృదయం ఆవేశంతో రగిలిపోయి దగ్గరనే ఉన్న పోలీసులపై రాళ్ళతో దాడి చేసాడు. దాంతో ఒక పోలీసు తల రక్కున పగిలి రక్తం చిమ్మింది. అరుస్తూ విరుచుకుని నేలకొరిగాడు పోలీసు.

## తప్పించుకొన్న చంద్రశేఖర్

ఒక్కసారిగా అంతటా నిశ్శబ్దం ఆవహించింది. అంతలో ఒకపోలీసు అధికారి “ఎవడ్రా ఈ సాహసాన్ని చేసిన వీరుడు?” అని వ్యంగ్యంగా ఆగ్రహంతో ప్రశ్నించాడు. క్షణాల్లో చంద్రశేఖరేనని పోలీసులకు తెలియటం, ఆతడిని పట్టుకోవటానికి ప్రయత్నించటంతో చంద్రశేఖర్ వారికి దొరకకుండా తూనీగలా అక్కడనుంచి శరవేగంగా జారుకున్నాడు.

అందరూ అతడిని పారిపొమ్మని కేకలు వేయసాగారు. తాను చేసిన ఘనకార్యానికి మనసులో తృప్తి చెందుతూ పోలీసులపై కసితో వారికి దొరక్కుండా తప్పించుకొన్నాడు. కనీసం ఒక్క పోలీసునైనా గాయపరచగలిగానని తృప్తి చంద్రశేఖర్‌ది. పోలీసులు చంద్రశేఖర్‌పై కక్షతో రగిలిపోయారు. చంద్రశేఖర్‌ని సజీవంగా పట్టుకోవాలని పైనుంచి ఆర్డర్ జారీ చేశారు.

## చంద్రశేఖర్ అరెస్టు

పోలీసులు తాము ఎంతమందిని గాయపర్చామో ప్రక్కనపెట్టి తమలో ఒక్కరిని చంద్రశేఖర్ గాయపర్చాడని అతడిపై కసితో రగిలిపోసాగారు. అతడి కోసం గాలింపు ముమ్మరం అయింది. ఒక్క అడుగు కూడా వదలకుండా పరిసర ప్రదేశాలన్నీ వెదకసాగారు. వేటకుక్కలు కూడ రంగంలోకి దించబడ్డాయి. ఎట్టకేలకు చంద్రశేఖర్ ఉన్న జాడ వారికి అందింది. దానితో వారు అతి నిశ్శబ్దంగా చంద్రశేఖర్ ఉన్న ధర్మసత్రాన్ని చుట్టుముట్టారు. ఫలితంగా 15 ఏళ్ళ చంద్రశేఖర్ పోలీసులకు పట్టుబడ్డాడు.

చంద్రశేఖర్ ఉన్న గదిని పరీక్షించిన పోలీసులకు గోడకు వేలాడుతున్న బాలగంగాధర తిలక్, మహాత్మాగాంధీ వంటి దేశనాయకుల ఫోటోలు కనిపించాయి. వాటిని చూడటంతో పోలీసుల కోపం మరింత పెరిగింది. అక్కడే అతడి చేతులకు బేడీలు వేసి జైలుకు తరలించారు. చంద్రశేఖర్ ముఖంలో వీసమెత్తు భయం కూడా కనిపించలేదు.

## నిర్భయంతో నవ్వులు చిందిస్తున్న చంద్రశేఖర్

కటకటాల వెనుక ఖైదు చేయబడిన చంద్రశేఖర్ లేత శరీరంపై పోలీసులాఠీల గుర్తులు ఎర్రగా తేలి ఉన్నాయి. అది చలికాలం కావటంతో చలి విలయతాండవం చేస్తోంది. చంద్రశేఖర్ ఒంటిపై చిన్న వస్త్రం తప్ప మరొకటి లేదు. అతడి శరీరాన్ని చలినుండి కాపాడుకోవటానికి కనీసం ఒక దుప్పటి కూడా ఇవ్వలేదు. ఆహారం, నీరు అస్సలు అతడి దరిచేరనివ్వలేదు. శారీరక బాధ కారణంగా అతడు తమని క్షమాపణ కోరతాడని పోలీసులు భావించారు.

అర్ధరాత్రి దాటుతోంది. మందపాటి ఖాకీదుస్తులు, ఆపైన ఉలెన్‌కోటును ధరించి ఉన్న పోలీసులే చలికి వణుకుతున్నారు. వారిలో ఒక పోలీసు చంద్రశేఖర్ ఏమన్నా దారికొచ్చాడేమోనని చూద్దామని చంద్రశేఖర్ ఉన్న గదివైపుకు వచ్చి చూశాడు. అంతే. అతడు ఒక్కక్షణం ఆశ్చర్యంతో నోరు తెరుచుకొని చూస్తుండిపోయాడు.

చంద్రశేఖర్‌ది చిన్నప్పటి నుండి మంచి వ్యాయామం చేసిన శరీరం. బస్కీలు, కసరత్తులతో అతడి శరీరం రాయివలె తయారయి ఉంది. చంద్రశేఖర్ ఎటువంటి చింతాలేకుండా కటిక నేలపై బాసిపట్ట వేస్కొని ముఖంలో నిర్భయంతో కూడిన చిరునవ్వులు చిందిస్తూ కూర్చొని ఉన్నాడు.





## సింహకిశోరంలా చంద్రశేఖర్

ఆ మరుసటి రోజున పోలీసులు చంద్రశేఖర్‌ని కోర్టులో మెజిస్ట్రేటు ముందు హాజరు పరిచారు. ఆ మెజిస్ట్రేటు పరమ చండశాసనుడిగా పేరు గాంచిన వాడు. కసాయి నేరగాళ్ళు సైతం ఆయనను చూసి హడలిపోతారు. ఆయన ముద్దాయి కళ్ళలోకి సూటిగా చూసి ప్రశ్నించాడంటే ఎటువంటి నేరగాడైనా నిజం చెప్పి తీరాల్సిందే.

కానీ ఆయన ఊహించని విధంగా చంద్రశేఖర్ అతిమామూలుగా ఆయన వైపు చూడసాగాడు. తనవైపు అంత ధైర్యంగా చూస్తూ బోనులో నిలుచుని ఉన్న ఆ యువకుడిని చూసిన మెజిస్ట్రేటు అతడిని నఖశిఖ పర్యంతం ఆసక్తితో గమనించాడు.

నూనూగు మీసాలతో, పాలుగారే బుగ్గలతో, అప్పుడే యవ్వనంలోకి అడుగిడుతున్న చంద్రశేఖర్ చక్రాల్లాంటి కండ్లతో, కండలు తిరిగిన శరీరంతో, ధైర్యంతో విశాలంగా మారిన ఛాతీతో, ముఖంలో నిజాయితీ, నిర్భయం ప్రదర్శితమవుతూ ఒక సింహపు పిల్లను గుర్తుకుతెచ్చాడు. తనను ఎంతగానో ఆకర్షించిన చంద్రశేఖర్‌ను తానే స్వయంగా ప్రశ్నించసాగాడు ఆ మెజిస్ట్రేటు. ఆయన మొదటి ప్రశ్న కోర్టు హాలులో ఖంగుమని వినిపించింది.

"నీ పేరేమిటి?" ఆయన ప్రశ్న వింటూనే చంద్రశేఖర్ ఠక్కున జవాబునిచ్చాడు.

"ఆజాద్" అతడి సమాధానంతో మెజిస్ట్రేటు కనుబొమ్మలు పైకి లేగిచినాయి. ఆజాద్ అనగా సర్వస్వతంత్రుడు అని అర్థం.

"నీ తండ్రి పేరు?" తిరిగి ప్రశ్నించారు మెజిస్ట్రేటు

"భారత్"

"నీ నివాసం"

"చెరసాల"

అనగా బ్రిటీష్ వారు భారతీయులను బంధించి రాజ్యమేలుతున్నారు కాబట్టి భారతదేశం భారతీయులకు చెరసాల అని చంద్రశేఖర్ యొక్క భావము.

## కఠిన శిక్షకు పాత్రుడైన చంద్రశేఖర్

చంద్రశేఖర్ జవాబులు చక్కటి భావార్థం కలిగి ఉన్నాయి. ఆ భావాన్ని అర్థం చేసుకున్న మెజిస్ట్రేట్ అతడి చాతుర్యానికి ఒక్కక్షణం కదలిపోయాడు.

అంత చిన్న వయసులోనే అతడు వెలిబుచ్చుతున్న దేశాభిమానం కర్కోటకుడైన ఆయనను సైతం కదలించివేసింది.

కానీ ఆతడు బ్రిటీష్ పాలకుల క్రింద ఉన్న అధికారి. వారి ఆదేశాలనూ, చట్టాలనూ అతడు పరిగణనలోకి తీసుకొని శిక్షించాలి. దానికేమాత్రం భంగం వాటిల్లినా ఆయనకి భూమిపై నూకలు మిగలవు. మనసు వ్యతిరేకిస్తున్నా కఠినమైన శిక్షను విధించటానికి సమాయత్తమయ్యాడు. కోర్టులో ఆయన తీర్పు మారుమ్రోగింది.

"ముద్దాయి అయిన చంద్రశేఖర్ విధి నిర్వహణలో తన బాధ్యతలను నిర్వర్తిస్తుండగా ఒక పోలీసును తీవ్రంగా గాయపరచి 'రాజద్రోహి' అయినాడని, న్యాయమూర్తికి సైతం తలబిరుసు సమాధానాలను ఇచ్చి మరింతగా శిక్షార్హుడయిన కారణంగా చంద్రశేఖర్‌కు ఆతడి నేరం క్రింద శిక్షగా 15 కొరడా దెబ్బలను విధించడమయింది" తెలియపరిచాడు.

## చంద్రశేఖర్‌ను శిక్షకు సిద్ధంచేసిన పోలీసులు

ఆ శిక్షను వింటూనే కోర్టు హాలంతా హాహాకారాలతో మారుమ్రోగిపోయింది. అప్పట్లో కొరడా దెబ్బలశిక్ష అత్యంత కఠినంగా ఉండేది. లంగూటీ తప్ప ఏమీలేని శరీరంపై బలిష్ఠమైన వాడితో కొరడాతో కొట్టించి శిక్షించేవారు. 'యువకుడైన చంద్రశేఖర్ తట్టుకుంటాడా' అని అంతా ఒక్కసారిగా బాధను వెళ్ళబుచ్చారు.

అప్పటికే వేలమంది అభిమానాన్ని చూరగొన్న చంద్రశేఖర్‌కి ఈ సంఘటనతో అభిమానుల సంఖ్య లక్షలమందికి చేరింది. చంద్రశేఖర్ వంటిపై గోచి ఒక్కటి మాత్రమే ఉంచి పోలీసులు అతడిని జైలు గేటులోపలే ఉన్న ఒక పెద్ద కూడలిలోకి తీసుకువెళ్ళారు.

ఒక కొయ్యచెక్కకు చేతులు వెనక్కి కట్టి చంద్రశేఖర్‌ని కదలకుండా బిగించి కట్టారు. యముడిని తలపింపచేస్తూ తలారీవాడు చేతిలో కొరడాతో చంద్రశేఖర్‌ని శిక్షించటానికి సిద్ధంగా ఉన్నాడు. అక్కడి పరిస్థితిని చూస్తుంటేనే ఒళ్ళు జలదరింపుకు గురిచేసేలా ఉంది.

## 'ఆజాద్'గా చంద్రశేఖర్

తలారీ కొరడాను రెండుసార్లు ఝుళిపించి చంద్రశేఖర్ వీపువైపుకి గురిచూసి కొట్టాడు. కొరడా అతని శరీరాన్ని తాకడమే కాకుండా శరీరానికి చుట్టుకు పోయింది. కొరడాని విదిలించి తీసాడు తలారి. చంద్రశేఖర్ శరీరంపై





కొరడా తగిలిన భాగం అంత పొలుసురేగి కుదుములు కట్టి, రక్తం బయిటికి వచ్చింది. చూచే వాళ్ళంతా బాధతో హాహాకారాలు చెయ్యసాగారు. అలాంటి సమయంలో చంద్రశేఖర్ మోముపై చిరునవ్వు తప్ప ఎటువంటి బాధాలేదు.

అతడి ముఖాన్ని చూస్తుండటంతోనే అక్కడి ప్రజలు ఒక్కసారిగా 'విప్లవం వర్ధిల్లాలి' అని నినాదాలు చేశారు. తలారి మరొక నాలుగు కొరడా దెబ్బలను విధించాడు. అయినా చంద్రశేఖర్ ముఖంలో చిరునవ్వు చెదరలేదు. 'వందేమాతరం', 'భారతమాతకు జై', "విప్లవం వర్ధిల్లాలి" అనే నినాదము మాత్రమే అతడి నోటినుండి వచ్చాయి.

ఈసారి దిగ్భ్రాంతి చెందడం తలారి వంతయింది. తన బలం తగ్గిందేమోనన్న అనుమానంతో మరింత బలంగా కొరడా దెబ్బను చంద్రశేఖర్‌పై వేశాడు. చంద్రశేఖర్ శరీరం రక్తంతో తడిసిపోయింది. ఒక్కసారిగా "ఆజాద్" అన్నపేరు ఆవరణంతా మారుమ్రోగిపోయింది.

## మండే సూర్యుడిలా ఆజాద్

తెలియనివారికి సైతం చంద్రశేఖర్ "ఆజాద్"గా పరిచయం అయ్యాడు. వేల నుండి లక్షలకు అభిమానం పెరిగిపోయింది. అద్భుతమైన అనన్యమైన సాహసాన్ని ప్రదర్శిస్తున్న ఆ వీరకిశోరాన్ని చూడటానికి ప్రజలు తండోప తండాలుగా వచ్చారు. పోలీసులు, అధికారులు అంతా విస్తుపోయి చూస్తున్నారు. ఎంతోమంది బాధతో స్పృహ తప్పటాన్ని వారు అప్పటివరకు చూసి ఉన్నారు.

చిరుతప్రాయంలో ఉన్న ఆ పసివాడు ఈ దెబ్బలను పూలదెబ్బల వలె ఆస్వాదించటాన్ని చూసి దిగ్భ్రాంతికి లోనయ్యారు. వారందరికి నోట మరొకమాట రాలేదు. శిక్షను పూర్తిచేసిన తరువాత చంద్రశేఖర్‌ను పోలీసులు వదలిపెట్టారు. రక్తం చిమ్ముతున్న దెబ్బలతో చంద్రశేఖర్ మండే సూర్యుని తలపిస్తూ "వందేమాతరం" అని పిడికిలి బిగించి నినాదాన్నిస్తూ బయటకి వచ్చాడు.

## సమ్మోహితులైన కాశీపుర ప్రజలు

ఈ వార్త అప్పటికే నగరమంతా పాకిపోవడంతో ఆ ప్రాంగణమంతా ప్రజలతో నిండిపోయింది. కనుచూపుమేరలో ఎక్కడా ఖాళీ స్థలం కనిపించడం లేదు. మెజిస్ట్రేటు ముందు 'ఆజాద్'గా సర్వస్వతంత్రుడనని ప్రకటించుకున్న అతడికి ఆ నామమే బిరుదుగా ఆ క్షణం నుంచి స్థిరపడిపోయింది.

'ఆజాద్' అనబడే ఆ యువసింహకిశోరాన్ని చూడటానికి వచ్చిన వేలాదిమంది పౌరులు జైలుగేటు నుండి బయటికి వస్తూనే చంద్రశేఖర్‌ను భుజాలపైకెత్తుకున్నారు. ఆజాద్ చేస్తున్న నినాదాన్ని తిరిగి ఉచ్ఛరిస్తూ "భారత్‌కీజై, విప్లవం వర్ధిల్లాలి" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరిచారు.

యుద్ధరంగంలో విజయమనే కుంకుమ శరీరమంతా ఆవహించినట్టు రక్తంతో తడిసి ఉన్న ఆ కుర్రవాడిని చూసిన ప్రజల మనసులు అతడిపట్ల అభిమానంతో నిండిపోయాయి. దేశాభిమానంతో ఊగుతున్న పెద్దలూ, వృద్ధులూ ఆతడిని పూలమాలలతో సత్కరించారు. 'భారతదేశాన్ని చెరసాల చేసిన నిరంకుశ ప్రభుత్వం' అంటూ ధైర్యంగా చెప్పిన ఆజాద్ సాహసం కాశీపుర ప్రజలను సమ్మోహితులని చేసింది.

## అభినందన మాలలతో ఆజాద్

చంద్రశేఖర్‌ను భుజాలకెత్తుకుని ప్రజలు ప్రారంభించిన యాత్ర కాశీనగర ముఖ్య వీధులన్నింటా సాగింది. కాశీపట్టణమంతా ఆజాద్ గూర్చి విజయ నినాదాలతో, దేశ నినాదాలతో మారుమ్రోగిపోయింది. చంద్రశేఖర్ పిడికిలి బిగించి ఇస్తున్న నినాదాలు అందరికీ మార్గదర్శకాలైయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన బహిరంగసభ ఏర్పాటు గావించబడింది.

ప్రజలంతా చంద్రశేఖర్‌ను చూడాలని ఉగ్రూతలూగుతుండటంతో చంద్రశేఖర్‌ని ఎత్తైన ఆసనంపైకి ఎక్కించారు. మనసు తలచినది, మనసుకు నచ్చినది క్రియా రూపంలో ఎటువంటి జంకూ లేకుండా చెయ్యటమే ఆజాద్‌కు తెలిసింది. ఇటువంటి అద్భుతమైన అభిమానం అతడికి ఆనందాన్ని కలిగించింది. అతన్ని ప్రసంగించమని అంతా కోరారు.

ప్రసంగానుభవం కించిత్తు అయినా ఆతడికి లేదు. అయితే కాశీపుర ప్రముఖుల ముందు తన మనస్సులో భావాన్ని వ్యక్తపరిచే అవకాశం ఆ రోజున అతడికి లభించింది.

ఏ పరిస్థితులలో దాన్ని వదలకుండా వినియోగించు కోవాలనుకుని అతనిలో నిబిడీకృతమయి ఉన్న దేశభక్తిని, బానిసలుగా తాము కోల్పోతున్న ఆత్మగౌరవాన్నీ, విప్లవ చైతన్యాన్నీ, స్వాతంత్ర్యం గూర్చి కాంక్షను సాధారణమైన వాడుకభాషలో హృదయాలకు హత్తుకుపోయేలా వ్యక్తపరిచాడు. సామాన్య ప్రజానీకానికి అతను ఏం చెబుతున్నాడో, ఏమి చేస్తున్నాడో, ఎందుకు తాపత్రయ పడుతున్నాడో అర్ధమయి అతనిని పూలమాలలతో ముంచెత్తివేశారు.





## యువకులకు స్ఫూర్తినిచ్చిన ప్రసంగం

అతడు చేసిన ప్రసంగంలో చివరిభాగం ఎంతోమంది యువకులలో ఉత్సాహాన్నీ, స్ఫూర్తినీ, ధైర్యాన్నీ నింపింది. స్వాతంత్ర్యపోరాటంలో ధీరోదాత్తమంగా పోరాటానికి వారిలో పునాదిని వేశాయి.

ఆజాద్ ప్రసంగంలో చివరిగా – "పరాయిదేశం నుండి వచ్చి మనదేశాన్ని ఆక్రమించుకొన్న ఆ దేశద్రోహుల బూట్లు నాకే పోలీసులు నన్ను ఈ రోజున బంధించి శిక్షించారు. కానీ ఈ అవకాశం వారికి ఇక ముందు కాలంలో ఏమాత్రం కలుగదు. నేను బ్రతుకున్నంత వరకు నా చేతికి బేడీలు వేయగలిగేవాడు ఉండడు.

నేను ఇప్పుడే కాదు ఇకపై ప్రతిక్షణం "ఆజాద్"గానే ఉండి తీరతాను. ఆజాద్‌గానే దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతాను. దానికోసం నా ప్రాణాలని సైతం అర్పించటానికి సిద్ధపడతానే కాని బందీని మాత్రం కాను. దేశమాత దాస్యశృంఖలాల విముక్తి కోసం నేను "ఆజాద్" గానే పోరాటాన్ని సాగిస్తానని దేశమాత పాదాల సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను" అంటూ ప్రసంగాన్ని ముగించాడు. ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడు కూడా.

## ఆదర్శ యువకేసరిగా ఆజాద్

కాశీపట్టణాన్ని ఒక ఊపు ఊపిన చంద్రశేఖర్ ఆజాద్ తొలి ప్రసంగాన్ని 'మర్యాద' అనే జాతీయవాద పత్రిక అతడి ఫోటోతో సహా ప్రచురించింది. ఆ పత్రిక యజమాని డా॥ సంపూర్ణానంద కూడా అగ్రశ్రేణి నాయకుడు. దేశభక్తుడు. ఆజాద్ పుట్టుపూర్వోత్తరాలను దేశమంతా తెలియచెప్పారు. తత్ఫలితంగా చంద్రశేఖర్ ఆజాద్ ధైర్యసాహసాలు దేశమంత వ్యాపించాయి. ప్రముఖులు సైతం అతని ధైర్యానికి అభినందనలు తెలిపారు. ఎంతోమంది యువకులకు ఆదర్శప్రాయంగా నిలిచిన చంద్రశేఖర్ ఆజాద్‌ని 'ఆదర్శయువకేసరి' అని కీర్తించారు.

## చంద్రశేఖర్‌లో రగిలిన విప్లవభావాలు

నిరాకరణోద్యమాల వంటి దేశసేవా కార్యక్రమాలలో పాల్గొనటం కారణంగా అతడు చదువులో ముందంజలో ఉండలేక పోయాడు. దాంతో అతడు తోటివిద్యార్థుల్లో ఒకక్లాసు తక్కువలో కూర్చుండవలసి వచ్చినా ఏమాత్రం బాధపడలేదు. ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులతో సహా అతడిని గౌరవించారు.

ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వటానికి ఆసక్తి చూపేవారు. దేశసేవా కార్యకలాపాలలో భాగం పంచుకుంటూనే తరగతి పుస్తకాలతో పాటుగా లైబ్రరీలో దొరికిన ఫ్రెంచివిప్లవం, రష్యాలోని బోల్షివిక్ విప్లవముల గూర్చి ఉన్న గ్రంథాలను అమితాసక్తితో నిద్రమానుకొని చదివేవాడు.

విప్లవకారులంతా ఏఏ కారణాల వలన, ఏఏ పరిస్థితులలో విప్లవాన్ని మొదలుపెట్టారో, ఎలా కొనసాగించారోనని విపులంగా, స్పష్టంగా తెలుసుకునేవాడు. ఏ విషయాన్నైనా కూలంకషంగా తెలుసుకోవటం అతడి అలవాటు.

పత్రికల కారణంగా దేశభక్తులైన గాంధీజీ, నెహ్రూ వంటి మహానాయకుల గూర్చి సంపూర్ణంగా తెలుసుకోవటంతో వారిని చూడాలని వువ్విళ్ళూరి పోయేవాడు.

## సహాయ నిరాకరణోద్యమాన్ని నిలపివేయాలని గాంధీజీ పిలుపు

గాంధీగారిని చూడటం, కలవటం అంటే ఆ రోజుల్లో కష్టతరమైన అంశంగానే ఉండేది. గాంధీగారు ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం పల్లెపల్లెల్లోనూ ఊపందుకుంది. కాంగ్రెస్ కార్యకర్తలంతా కూడా పూర్తి కృషి చేసి ఉద్యమాన్ని మహోద్యమంగా మార్చారు. ప్రభుత్వానికి ఈ నిరసనతో తన కార్యకలాపాలను ఏ విధంగా నడిపించాలో కూడా అవగతము కాని పరిస్థితి ఏర్పడింది.

అయితే హఠాత్తుగా గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం ఆపివేయ వలసినదిగా దేశవ్యాప్తంగా పిలుపునిచ్చారు. దేశమంతా నిర్ఘాంత పోయింది. గాంధీజీ ఉద్యమాన్ని నిలిపి వేయటానికి కారణమైన సంఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరిగింది.

## చౌరీ చౌరా

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరఖ్‌పూర్ జిల్లాలో చౌరీచౌరా అనే గ్రామం ఉంది. గాంధీజీ ఇచ్చిన సహాయ నిరాకరణోద్యమం పిలుపులో భాగంగా ఆ గ్రామంలోని రైతులు ప్రభుత్వానికి పన్ను కట్టడం ఆపివేశారు. దాంతో అధికారులు కొంతవరకు మౌనం వహించి ఆ తర్వాత వీరప్రతాపం చూపెట్టసాగారు.





రోజు రోజుకి శృతిమించుతున్న వీరి ఆగడాలకు ప్రజలు భయ భ్రాంతులవసాగారు. కొంతమంది యువకులు విపరీతమైన ఆవేశంతో ఒకరోజు పోలీసుల పై తిరగబడి కొంతమందిని తాళ్ళతో బంధించి నిప్పుపెట్టారు. ఈ విషయం గాంధీజీకి వేగంగా చేరింది.

అహింసతత్త్వం ప్రజలలో ఐక్యం అవ్వాలని, అహింసా మార్గంలోనే స్వాతంత్రాన్ని కోరి చేపట్టుకోవాలనే ఆశయంతో ఉన్న గాంధీజీ ఈ సంఘటనకు హతాశుడైనాడు. అయితే ప్రభుత్వం వారిపై ఏ చర్యలు తీసుకోకముందే సహాయ నిరాకరణోద్యమం ఆపివేయాలని దేశవ్యాప్తంగా పిలుపునిచ్చారు. దీంతో తెల్లదొరల అధికార ప్రతాపం నిరాటంకంగా కొనసాగింది. ఈ సంఘటన యువకులపై తీవ్రప్రభావం చూపింది.

అహింసా పద్ధతితో కాకుండా తీవ్ర ధోరణిలో స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించితేనే గాని దేశం దాస్యవిముక్తి కాబోదనే ఆలోచన వారిలో కలగటానికి నాంది అయింది.

## విప్లవకారులతో ఉన్న బెంగాల్

అయితే అప్పటికే విప్లవ కార్యకలాపాలు పలుప్రదేశాలలో రూపాంతరం చెంది ఉన్నాయి. బెంగాల్‌లో ఉద్భవించిన ఈ విప్లవ కార్యకలాపాల యొక్క నాయకులు ఉత్తరప్రదేశ్ చేరుకొని ఉన్నారు. కారణం – 'వందేమాతరం' ఉద్యమానికి స్ఫూర్తిని ఇచ్చిన వందేమాతర గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ బెంగాల్ నివాసస్తులే.

బెంగాలు విప్లవకారులకు నిలయమైందనే పేరును గాంచి ఉంది. తీవ్రవాదులు సోవియట్ రష్యాలో విప్లవవీరుల స్ఫూర్తితో ప్రభుత్వాన్ని ఎదిరిస్తూ పలుకార్యక్రమాలను చేపట్టారు. సంఘాలు కూడా ఏర్పాటు కాబడటంతో ప్రభుత్వం దృష్టి బెంగాల్‌పై పడింది. ఈ విప్లవసంఘాలకు కారకులు యువకులు అని ప్రభుత్వం తెలుసుకుంది. కొందరు యువకులు ఆవేశం కారణంగా పోలీసుల దృష్టిలోకి వచ్చారు. దాంతో ప్రభుత్వం వారిపై అంక్షలు విధిస్తూ వారెంట్లు జారీ చేసింది.

## "ఇండియన్ రిపబ్లిక్ అసోసియేషన్"

కాశీపట్టణంలో బెంగాలీలు ఎప్పటినుండో నివాసం ఏర్పరుచుకొని ఉండటంతో బెంగాల్‌లోని విప్లవకారులు చాలా తక్కువకాలంలో కాశీలో విప్లవ

సమితిని ఏర్పరచుకున్నారు. నరేంద్రభట్టాచార్యచే ఏర్పడింది ఒక సమితి. శశీంద్రనాథ్ సన్యాల్ అనే వ్యక్తి ఏర్పరిచిన సమితి మరొకటి ఏర్పాటు అయింది. ఈ సమితిలో యువకులు సభ్యులైనారు.

ఈ సమితిల్లోని సభ్యులంతా సాయుధపోరాటం వలన మాత్రమే దేశ దాస్యవిముక్తి సాధ్య పడుతుందని నమ్మి కార్యకలాపాలను నిర్వహించేవారు. అయితే రహస్యంగా వీరి కలాపాలు జరుగుతుండటంతో వీరికి ఎటువంటి ధనసహాయం అందలేదు.

రహస్యంగా ఉండటం వలన రెండు సమితి సభ్యులకు ఒకరికొకరు పరిచయాలే ఏర్పడలేదు. అయితే కొద్దికాలానికి వీరికి పరిచయాలు ఏర్పడ్డాయి. ఇరువురి సమితిల ఆశయాలు భారతదేశాన్ని ప్రజా రిపబ్లిక్‌గా రూపొందించటమే అని అర్థం చేసుకున్నాయి.

దాంతో వారంతా ఏకమై రెండు సమితిలను ఏకం చేస్తూ 'ఇండియన్ రిపబ్లిక్ అసోసియేషన్' అనే పేరును పెట్టి ఆ సంస్థకు కొన్ని నియమాలను పెట్టుకొని వారి ఆశయాలకు అనుగుణంగా కార్యకలాపాలను నిర్వహించసాగారు.

## చంద్రశేఖర్‌ని ఆకర్షించిన ఇండియన్ రిపబ్లిక్ అసోసియేషన్

ఈ సంఘంలోని ముఖ్యులు ఇలాంటి దళాలను వేరే ప్రదేశాలలో కూడా స్థాపించటం కోసం వెళుతుండేవారు. అయితే కాశీపట్టణప్రాంతంలో వ్యవహారాలను శచీంద్రనాథ్‌బక్షి, రవీంద్రమోహన్ సర్కార్, రాజేంద్రలాహిరీలు నాయకత్వం వహించేవారు.

వీరి నాయకత్వంలో ఎంతోమంది యువకులు ఈ సంఘంలో చేరేవారు. విప్లవ భావాలతో ఊపుమీద ఉన్న చంద్రశేఖర్‌కూడా ఈ దళంలో చేరాడు. అతడికి ఈ దళ నియమాలు, ఆశయాలు ఎంతగానో నచ్చటంతో ఆ సంస్థకొరకు పనిచేయటానికి నిర్ణయంచుకున్నాడు.

ఈ సంస్థ ఆశయం భారతదేశాన్ని సర్వస్వతంత్రంగా చేయటం. దాని కొరకు సామ్రాజ్యవాదాన్ని కూకటి వేళ్ళతో నిర్మూలించటానికి కృషి చేయటం, అవసరమైన ఆయుధశక్తిని ఉపయోగించటం. వారి పోరాటంలో స్త్రీలకు, అమాయక ప్రజలకు హాని జరగకూడదు.





## నాయకుడిగా ఎదిగిన చంద్రశేఖర్

నాయకత్వ లక్షణాలను చిన్నప్పటి నుంచి అణువణువునా కలిగి ఉన్న చంద్రశేఖర్ ఆజాద్ అతి కొద్దికాలంలో ఇండియన్ రిపబ్లిక్ అసోసియేషన్‌లో కీలకసభ్యునిగా తయారయ్యాడు. తనలోని శక్తినీ, ధైర్యసాహసాలనూ, సమయస్ఫూర్తినీ నిజాయితీగా కార్యకలాపాలలో ప్రదర్శించటం వలన ముఖ్యుల మన్ననలు పొంది తనూ నాయకులలో ఒకడిగా అయ్యాడు.

ప్రధాన కార్యకలాపాలని నిర్వహించే నాయకులలో డాక్టర్ రోషన్‌సింగ్, అష్ఫార్ ఉల్లా, మన్మధనాధ గుప్తా, దామోదర్ సేఠ్, భూపేంద్రనాథ్ సన్యాల్, రామకృష్ణఖత్రీ ఉన్నారు. విప్లవాన్ని ప్రతి ప్రదేశంలో ఉద్భవించటానికి వీరంతా కృషి చేసేవారు. యువకుల సంఘటిత శక్తే దేశస్వాతంత్ర్యానికి తోడ్పడుతుందని భావించి యువశక్తి పెంచటానికి ప్రయత్నాలను చేయసాగారు.

## ప్రచారంకొరకు ముద్రించిన కరపత్రము

''ఇండియన్ రిపబ్లిక్ అసోసియేషన్'' యొక్క ఆశయాలను కార్యక్రమాలను దేశవ్యాప్తంగా తెలియచెప్పటానికి నాయకులంతా కలిసి ఏకగ్రీవ నిర్ణయం తీసుకొని ఇంగ్లీషులో ఒక కరపత్రాన్ని తయారు చేశారు. ఆ పత్రాన్ని రహస్యంగా ముద్రించటానికి ఎన్నో ప్రయత్నాలు చేసి విజయం సాధించారు. ముద్రించటం ఒక ఎత్తు అయితే ప్రతి ప్రదేశంలో పోలీసులకు దొరకకుండా కరపత్రాలను పంచటం 'మహా యజ్ఞం' వంటిది.

అయితే ఆజాద్ వంటి నాయకుల ఆధ్వర్యంలో, వారి సలహాల సూచనలతో సభ్యులైన యువ విప్లవకారులంతా ఎంతో చాకచక్యంతో, చాతుర్యంతో పంచిపెట్టారు. కత్తిమీద సామువంటి ఈ ప్రక్రియను బ్రిటీష్ పోలీసు యంత్రాంగం కళ్ళుగప్పి అంతటా చేర్చారు. ఆ పత్రంలోని సారాంశం ఎంతోమంది స్వాతంత్ర్య పిపాసగల యువకులకు బలాన్ని ఇచ్చింది.

ఆ కరపత్రంలో తమ సంఘం దేశదాస్య శృంఖలాల్ని పటాపంచలు చేసే కార్యకలాపాలని నిర్వహిస్తుందని దేశస్వాతంత్ర్యం లభించటానికి తమకు యువకుల సహాయం అవసరమని ఈ కరపత్రాన్ని చదివిన యువత తమకు సహాయసహకారాలని అందించవలసినది అని ప్రచురించారు.

స్వాతంత్ర్య పోరాట భావాలతో ఆవేశపూరితులై ఉన్న యువకులకు దీంతో దారి దొరికినట్లుగా అయింది. ఈ కరపత్రం వారికి పవిత్ర శాసనముగా

లభించింది. అడవిలో దారి తోచక చిక్కుబడిన వారికి విశాలమార్గం తటస్థించినట్లయింది. వారిని నడిపించేందుకు నాయకులు తమకు అందుబాటులో ఉన్నారనే ఉత్సాహం వారిని ఎంతో ఉద్వేగానికి గురిచేసింది.

## ఆజాద్‌కొరకు పోలీసుల గాలింపు

అయితే దాచాలనుకున్న విషయం ఎంతో కొంతకాలం తరువాత బయటపడే తీరుతుంది. అదే చంద్రశేఖర్ ఆజాద్ వంటి నాయకులు తలపెట్టిన యజ్ఞ రహస్యం గూర్చి పోలీసులకు చూచాయగా తెలిసిపోయింది. అప్పటికే ఆజాద్ కాశీని వదలి ఇతర ప్రాంతాలలో విప్లవకారుల సంఘటిత పరిచే కార్యక్రమాన్ని చేపట్టి వున్నాడు.

పోలీసులకు ఈ యజ్ఞానికి ప్రముఖ పాత్ర చంద్రశేఖర్ వహిస్తున్నాడనే విషయం తెలియడంతో అతడి కోసం గాలింపు మొదలైయింది. విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ ఎక్కడా కొద్ది రోజులయినా స్థిరంగా ఉండకుండా విప్లవకారులను ప్రోగు చేస్తూ పలు ప్రదేశాలలో తిరగసాగాడు. అయితే పోలీసులు గూర్చిన భయం అతడిలో ఏమాత్రం లేదు. తమ సంస్థ కార్యకలాపాలను ఎంత విజ్ఞతతో నిర్వహించాలా అనేది ఆతడి ఆలోచన.

## నవభారతసభ

ఆజాద్‌కి తమవంటి విప్లవకారుల సంఘం వంటిదే లాహోర్‌లో నిర్వహిస్తున్నారని తెలిసింది. "నవభారతసభ" గా ఏర్పాటైన ఆ సంఘానికి సర్దార్ భగత్‌సింగ్, సుఖదేవ్, భగవతీచరణ్ యశ్‌పాల్‌లు నాయకులు. వారి ఆధ్వర్యంలో కార్యకలాపాలన్నీ జరిగేవి.

ఈ యువనాయకులను కలుపుకోవాలనే కోర్కె చంద్రశేఖర్ ఆజాద్‌కు కలిగింది. ఆ క్షణం నుంచి ఏర్పాట్లు రహస్యంగా చేయసాగాడు. బ్రిటీష్ అధికారం విప్లవాన్ని ఏమాత్రం పెరగనివ్వ దలచుకోలేదు. విప్లవాన్ని ఎన్నో సంవత్సరాల క్రితం నుండి వారు అనేక కుతంత్రాలను పన్ని అణచివేస్తూనే ఉన్నారు.

విభజించి పరిపాలించు అని వారి టక్కరి విధానాన్ని అమలుపరిచి వ్యాపారం చేసుకుంటామంటూ వచ్చి భారతదేశాన్నే ఆక్రమించుకున్నారు. వారు ఆక్రమించుకొన్న దేశాన్ని అంత త్వరగా, అంత తేలిగ్గా వదలుతారా? ఎంత రక్తపాతం జరగాలో?





## ఝాన్సీలో రహస్య సమావేశం

గాంధీజీ శాంతియుతంగా, అహింసామార్గంలో సత్యాగ్రహ వ్యక్తీకరణ ద్వారా స్వాతంత్ర్య పోరాటం జరపాలని భావించాడు. అయితే మంత్రాలకు చింతకాయలు రాలటం అసాధ్యమని సాయుధవిప్లవం, రక్తతర్పణం చేతనే దేశానికి దాస్య విముక్తి లభిస్తుందని భావించిన వారు విప్లవవీరులు అయ్యారు. బ్రిటీష్ వారికి సింహస్వప్నాలుగా అయిన విప్లవ వీరులు ఝాన్సీలక్ష్మీబాయి, నానాఫడ్నవీస్, తాంతియాతోపే వంటి వారెందరో వారి మార్గంలోనే వచ్చారు.

విప్లవ వీరులలో చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ 'నవభారతసభ' 'ఇండియన్ రిపబ్లిక్ అసోసియేషన్'లు పరిసర ప్రాంతాలలోని కార్యకర్తలందరినీ ఝాన్సీలో రహస్య సమావేశంలో పాల్గొని పటిష్టమైన పోరాట కార్యక్రమాలను రూపొందించాలని భావించి కార్యకర్తలకు ఝాన్సీలో సమావేశం కావలసినదిగా వార్తను అందించారు. ఈ రహస్య సమావేశానికి హాజరవటానికి కాన్పూరు, లాహోర్ తదితర ప్రాంతాల నుండి నాయకులు వచ్చారు.

## రద్దయిన రహస్య సమావేశం

అయితే చివరి క్షణంలో సి.ఐ.డి.ల ద్వారా విప్లవకారుల రహస్య సమావేశం గూర్చి తెలుసుకొని ఝాన్సీని పోలీసులు ముట్టడి చేస్తున్నారని చంద్రశేఖర్‌కి కబురు తెలిసింది. అంతే క్షణాలలో రెండోవారికి తెలియకుండా సమాచారాన్ని మిత్రులందరికీ తెలియపరిచేలా చేసి వారికి తిరుగు సమావేశం గూర్చి అతిత్వరలో తెలియచేస్తానని వార్తని అందింపచేశాడు ఆజాద్.

సి.ఐ.డి. పోలీసుల వల నుంచి అతి చాకచక్యంతో తృటిలో తప్పించుకొని రాత్రికి రాత్రి ఝాన్సీని వదలి పెట్టారు. అతడి రహస్య ప్రయాణం ఢిల్లీకి చేరింది. కార్యకర్తలంతా వారి వారి ప్రదేశాలకు చేరుకున్నారని వార్తని అందుకుని కొంత స్థిమితపడ్డాడు. ఏమాత్రం విశ్రాంతి తీసుకోకుండా ఢిల్లీ చేరుతూనే అక్కడి కార్యకర్తలతో చర్చలు జరిపాడు. ఆ తర్వాత దగ్గరి ప్రాంతాలలో కార్యకర్తలతో చర్చలు జరిపాడు.

## ఆజాద్, భగత్‌సింగ్‌ల తొలిసమావేశం

ఆ తర్వాత అతడి ప్రయాణం లాహోర్‌కు సాగింది. ఢిల్లీలోని కార్యకర్తలకి పోలీసులు విప్లవ సంఘాలను రూపుమాపటానికి వేసే ఎత్తులను ముందుగానే కనిపెట్టి తమకు వార్తను అందచేసేలా వారికి తర్ఫీదునిచ్చి చక్కటి ప్రణాళికలను వారికి తెలిపి లాహోర్ చేరాడు.

అయితే లాహోర్‌లో భగత్‌సింగ్, సుఖదేవ్ వంటి ప్రముఖ నాయకులని కలుసు కోలేకపోయాడు. భగత్‌సింగ్‌ని కలవాలనే అతని ఆశ నెరవేరలేదు. అయితే అతడి ఆశ ఆ తర్వాత నెరవేరింది. లాహోర్ నుంచి పలు ప్రదేశాలలో కార్యకర్తలను కలుసుకుంటూ కాన్పూరు చేరాడు చంద్రశేఖర్. భగత్‌సింగ్, సుఖదేవ్ వంటి ప్రముఖులంతా అక్కడే ఉన్నారనే వార్త తెలియటంతో మొదటిసారిగా చంద్రశేఖర్ ఆజాద్ భగత్‌సింగ్‌ను కలుసుకొని సమావేశమైయ్యారు.

## తొలిసమావేశంలోనే ఆప్తమిత్రులైన ఆజాద్, భగత్‌సింగ్‌లు

ఒకరిని గూర్చి మరొకరు అప్పటివరకు విని ఉండటమే కాని ముఖాముఖీ చూసుకొని ఉండలేదు. ఇద్దరూ ఎదురవటంతోనే ఆలింగనం చేసుకున్నారు. ఒకే భావాలతో నిండిన మనసులు కలిగిన వారి శరీరాలు ఒకరినొకరు తాకుతూనే ఏదో ఆత్మీయభావం శరీరమంతటా వ్యాపించింది. వారి సమావేశం గంటల తరబడి సాగింది.

భవిష్యత్ ప్రణాళిక గూర్చి చర్చించారు. విప్లవసంఘాలు సంయుక్తంగా నిర్వహించవలసిన కార్యకలాపాలను గూర్చి, సంఘ లక్ష్య సాధనము అంతా ఏ విధంగా ముందుకు సాగాలి అనే భారీ ప్రణాళికను ఇరువురూ కలసి ఏర్పరుచుకున్నారు. ఆ సమయంలో భగత్‌సింగ్ వెలువరుస్తున్న విశాలలక్ష్య



సిద్ధాంతాలకు, నిర్వహించవలసిన విధానాలను వింటున్న ఆజాద్‌కు భగత్‌సింగ్‌పై ఎనలేని గౌరవాభిమానాలు కలిగాయి. ఇంతటి మహత్తరమైన ఆలోచనలే విప్లవకారులు లక్ష్యాన్ని ఛేధించటానికి దోహదపడతాయని మనఃస్ఫూర్తిగా భావించాడు. బలమైన శరీరసౌష్ఠవంతో ధైర్యసాహసాలను వెదజల్లుతున్న ఆజాద్ ఉగ్ర స్వరూపం ఇంతటి సౌమ్యతతో వెల్లివిరియటాన్ని చూసి భగత్‌సింగ్ ఆశ్చర్యపోయాడు. సమయాను సందర్భంగా వ్యవహరించే ఆజాద్ విప్లవసంఘాల నాయకుడిగా పరిపూర్ణ న్యాయాన్ని చేకూర్చుతాడని భావించాడు. ఒకరిమీద మరొకరికి గౌరవం కలిగి ప్రేమ, అభిమానాలతో వారిరువురు ఒకరికొకరు ఆప్తమిత్రుల వలె మెలిగారు.





## స్వస్థలాలకు చేరుకున్న ఆజాద్, భగత్‌సింగ్

వారిరువురు సమావేశంలో అతికీలకమైన నిర్ణయాలను తీసుకున్నారు. ఒకరిమీద మరొకరికి నమ్మకం, గౌరవం కుదరటంతో వారి భవిష్యత్ ప్రణాళిక కార్యక్రమ నిర్ణయం నిరాటంకంగా సాగింది.

భారతదేశంలోని విప్లవకారులంతా సమావేశమయ్యే విస్తృత కార్యక్రమానికి సమయం నిర్ణయించారు. ఆ తర్వాత వారు దేశపరిస్థితులపై చర్చించారు. పంజాబులో రైతు ఉద్యమాల గూర్చి, లాహోర్‌లో జరిగిన దారుణాల గూర్చి భగత్‌సింగ్ చంద్రశేఖర్‌కు కళ్ళకు కట్టినట్లుగా చెబుతుంటే ఆజాద్ శరీరం ప్రతీకారేచ్ఛతో రగిలిపోయింది. భారతదేశము పరాయివారి పాలన నుండి ఎప్పటికి విముక్తిని పొందుతుందో, ప్రజల బాధలు ఎప్పటికి ముంగింపుకు వస్తాయోననే బాధ వారిరువురి మనస్సులను పిండివేసింది. దీర్ఘచర్చలనంతరం వారిరువురు వీడ్కోలు తెలుపుకొని వారి వారి స్థానాలకు చేరుకున్నారు.

## ఝాన్సీలో అతిథిగా మకాం

భగవంతుడు ఎవ్వరికి ఏ సమయంలో ఎటువంటి ఆలోచనలు కలుగచేస్తాడో ఎవ్వరికి తెలుసు? అయితే భగవంతుడు కలుగచేసే ఆలోచనలకు మాత్రం అర్థం ఉండి తీరుతుంది. కాన్పూరులో ఆజాద్ భగత్‌సింగ్‌తో సమావేశానంతరం తిరిగి ఝాన్సీ చేరుకున్నాడు. ఝాన్సీలో విప్లవ దళానికి సదాశివ మల్కోపూర్ నాయకుడిగా ఉండి నడిపిస్తున్నాడు.

ఆజాద్ ఆ యోధుని ఇంటిలో మకాం పెట్టి అతిధిగా ఉన్నాడు. ఆయనకు తానన్ని రోజులు పర్యటించిన ప్రాంతాలూ, అక్కడి విశేషాలూ, చర్చలూ, తీసుకున్న నిర్ణయాల గూర్చి వివరంగా తెలిపాడు. సర్దార్ భగత్‌సింగ్ గూర్చి వివరాలను కూలంకషంగా తెలిపాడు. భవిష్యత్ ప్రణాళికను గూర్చి వివరించాడు. ఒకరోజు హఠాత్తుగా "సదాశివ్ – నీకు నేను పుట్టిన ఊరు, మా యిల్లు చూపెడతాను. వెంటనే ప్రయాణం అవటానికి సిద్ధం అవ్వు" అన్నాడు. సదాశివ మల్కోపూర్ హఠాత్తుగా అతడు చెప్పిన విధానాన్ని విషయాన్ని విని విస్మయం చెందాడు. ఏనాడు ఎవరు బలవంతం చేసినా అతడి పుట్టు పూర్వోత్తరాలు ఎవ్వరికి తెలుపలేదు.

అటువంటిది తానేమాత్రం అడుగకుండా ఏమాత్రం, విషయ ప్రస్తావన రాకుండగానే తానంతట తానే హఠాత్తుగా తన యిల్లూ, ఊరూ చూపెడతాననే సరికి ఆయనకి చంద్రశేఖర్ ఆజాద్ మొదటిసారిగా విచిత్రంగా కనిపించాడు.

## 'భాంవరా' లో ఆజాద్

అయితే సదాశివునికి ఆజాద్ పైనున్న నమ్మకం గౌరవం మాటలలో చెప్పటానికి కష్టమనే చెప్పవచ్చు. ఆజాద్ పిలిస్తే ఆయన ఉరికంబం ఎక్కడానికి నిద్రలో కూడా సంసిద్ధంగా ఉంటాడు.

ఎటువంటి ఆలోచనలకు తావు ఇవ్వకుండా సదాశివ్ మల్కోపూర్ చంద్రశేఖర్ ఆజాద్ వెంట బయలుదేరాడు. వారు తక్కువ సమయంలోనే రహస్యంగా 'భాంవరా' గ్రామానికి చేరుకున్నారు. జన్మించిన గడ్డపై కాలుమోపుతూనే ఆజాద్ హృదయం పులకింతకు గురి అయింది. మాతృస్పర్శ శరీరాన్ని సుడి గాలిలా చుట్టివేసింది.

సదాశివ్ మల్కోపూర్‌తో కలసి తనకు మొదటిసారిగా విద్యను నేర్పించిన గురువు మనోహర్‌లాల్ త్రివేది ఇంటికి వెళ్ళాడు. గురువుగారికి పాదాభివందనం చేశాడు. ప్రియశిష్యుడిని చూస్తూనే ఆయన పడిన ఆనందం అంతా ఇంతాకాదు. 10 సంవత్సరాలకి తిరిగివచ్చి పాదాభివందనం చేస్తున్న శిష్యుడిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకొన్నారు. ఆనందంతో ఆయన ముఖం కాంతివంతం అయింది. చంద్రశేఖర్ మిత్రుని పరిచయం చేశాడు.

## తల్లిదండ్రులను కలిసిన ఆజాద్

అప్పుడే మిత్రుని ఇంటికి కాలక్షేపం కొరకు సీతారాం తివారి వచ్చారు. దూరం నుండి కొడుకును ఆనవాలు పట్టలేకపోయారు. తండ్రిని చూచి ఆజాద్ దగ్గరగా వచ్చాడు. నూనూగుమీసాలతో నవయవ్వనంతో భాసిల్లుతున్న మోముతో తనకు పాదాభివందనం చేస్తున్న కొడుకుని చూసి సీతారాం తివారి మనస్సు ఆనందసాగరమైంది. కొడుకుని అక్కున చేర్చుకొని ఎంతో స్వాంతన పొందాడు. తన వద్ద లేకపోయినా సురక్షితంగా ఉన్నాడనే భావన ఆయన మనస్సుకు ఎంతో ఆనందాన్ని అందచేసింది.

ఆ తర్వాత తన రాకను గూర్చి రహస్యంగా తల్లికి తెలపగా ఆమె పరుగుపరుగున గురువుగారి ఇంటికి వచ్చింది. ఎంతో వేదనను జగరాణీదేవి అనుభవిస్తూందని ఆమె ముఖము చూస్తూనే ఆజాద్‌కి అర్థం అయింది. నెమ్మదిగా తల్లిని చేరాడు. జగరాణీదేవి వణుకుతున్న చేతులతో చంద్రశేఖర్ ముఖాన్ని పట్టుకొని ముద్దులతో ముంచివేసింది. పసిబిడ్డలా అక్కున చేర్చుకున్నది. ఆమె తాపత్రయాన్ని చూస్తున్న అక్కడి వారికి కళ్ళనీళ్ళు వాటంతట అవే వచ్చాయి.





## విద్యార్జనకై వచ్చిన వాడిగా చంద్రశేఖర్

కొడుకుతో కొంతసేపు మాట్లాడిన తరువాత ఇంటికి రమ్మని పిలిచింది. దాంతో ఆజాద్ తాను అక్కడికి రావటం తనకీ, తల్లిదండ్రులకూ మంచిది కాదని తాను రెండు దినాలు ఇక్కడే ఉంటానని ప్రతిరోజు రావలసినదని, తన రాక గూర్చి మరెవరికి తెలపవద్దని చెప్పాడు.

ఆ రాత్రి భోజనం ముగించి పడుకొన్న చంద్రశేఖర్‌కి తల్లే కళ్ళముందు మెదలసాగింది. కానీ ఆమె వద్దకు వెళితే ఏదో విధంగా తన బాంధవ్యం బయటపడి పోలీసుల కారణంగా తన తల్లిదండ్రులకు కష్టం కలుగువచ్చు. అదే గురువుగారింట విద్యార్జన కోసం వచ్చిన విద్యార్థులుగా ఉండవచ్చని అతడి ఆలోచన. కానీ తల్లి కోరికను కాదనలేక మరుసటి రోజు ఇంటికి వెళ్ళి తల్లిపెట్టిన కమ్మటి భోజనాన్ని కడుపారా తిన్నాడు. అయితే వూరివారెవరూ ఆజాద్‌ని గుర్తుపట్టలేదు.

## గ్రామాన్ని వీడిన చంద్రశేఖర్

నాలుగు రోజులు ఏదో ఒక విధంగా ఎవ్వరికీ అనుమానం రాకుండా గడిపారు. ఐదవ రోజున సదాశివుడు అక్కడ నుంచి వీలైనంత త్వరగా వెళ్ళటం మంచిదని మిత్రుని హెచ్చరించాడు. గురువుగారు పనిమీద బయటికి వెళ్ళటంతో ఆయన వచ్చిన తరువాత ఆయనకి చెప్పి వెళ్దామని నిశ్చయించుకున్నారు. అయితే మనోహర్‌లాల్ త్రివేది పనిమీద తాలూకాఫీసుకి వెళ్ళగా అక్కడ చంద్రశేఖర్ గూర్చి ఆచూకీని తీస్తూ పోలీసు బలగం తారసపడింది.

పోలీసులకు ఎటువంటి అనుమానం రాకుండా గ్రామానికి తిరిగివచ్చిన త్రివేది ఇంటికి చేరి చంద్రశేఖర్‌కు విషయం చెప్పాడు. తాము ఇక్కడ ఉండటం క్షేమం కాదని భావించిన వారు ఆ రోజు అర్ధరాత్రి దాటగానే గురువు వద్ద శెలవు తీసుకొని తన తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పమని కోరుతూ మిత్రునితో బయలుదేరాడు.

## నిరహంకారిగా చంద్రశేఖర్

సరిగ్గా వీరు బయలుదేరిన సమయానికి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం మొదలయింది. అయినా ఆగకుండా బయలుదేరి అడవిగుండా ప్రయాణం చేస్తూ మధ్యలో కాస్సేపు విశ్రాంతి తీసుకుని బయలుదేరి గమ్యాన్ని చేరుకున్నారు. చంద్రశేఖర్ కార్యకలాపాలు విస్తృతంగా పెరిగాయి. క్షణం కూడా తీరిక లేకుండా కార్యకలాపాలను నిర్వహించేవాడు.

మధ్యలో భగత్‌సింగ్, సుఖదేవ్, కుందన్ లాల్ వంటి వారితో రహస్య సమావేశాలు జరిపి మార్పు చేయవలసిన విషయాలు గూర్చీ, కార్యక్రమాల అమలు గూర్చీ ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకునేవారు. వీరి సమావేశంలో ముఖ్యమైన సమావేశాలు 1928, అక్టోబర్ 8,9 తారీకులలో ఢిల్లీలోని పాతకోటలో జరిగాయి.

ఈ సమావేశాలకి విప్లవకారులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి హాజరయ్యారు. కొన్ని ముఖ్యమైన కారణల కారణంగా చంద్రశేఖర్ వీటికి హాజరు కాలేదు. అయితే అందరూ కలసి తీసుకునే నిర్ణయానికి తన సమ్మతినే తెలుపుతానని తనమాటగా చెప్పమని భగత్‌సింగ్ ద్వారా తెలిపి తానేమిటో అందరికీ తెలిసేలా చేశాడు. నాయకుడైన చంద్రశేఖర్‌లో ఎటువంటి అహంకారం మచ్చుకు కూడా లేదు. సదా దేశం దాస్యవిముక్తి కోసమే అతని ఆలోచనలు సాగుతుండేయి.

## ఇండియన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ

ఈ రెండు రోజుల సభల సమావేశాలలో భగత్‌సింగ్ నేతృత్వంలో విప్లవ సంఘాలన్నీ కలిసి వాటిని సమైక్యం చేస్తూ "ఇండియన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ" గా పేరు పెట్టారు. ఈ సంఘం తరపున భగత్‌సింగ్ మాట్లాడుతూ ఏనాడైతే భారతదేశం దాస్యవిముక్తి చెంది స్వాతంత్ర్యం పొందుతుందో ఆ రోజు ప్రజాప్రభుత్వం ఏర్పాటు జరుగుతుంది.

ఈ ఏర్పాటు వలన ఒక మనిషిని మరో మనిషి దోచుకునే అవకాశం ఉండదు. ప్రతివారు తాము చేసే పనులకు తగ్గ ప్రతిఫలాన్ని ప్రతి ఒక్కరు పొందటమే కాక గౌరవంగా బ్రతుకుని సాగించగలుగుతారు. దేశస్వాతంత్ర్యాన్ని అహింసా పద్ధతిలో సాధించటం ఎంతో కష్టతరమైంది.

అయితే మనది విప్లవమే కాని దౌర్జన్యంకాదు. విప్లవం ద్వారా మాత్రమే దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చి ప్రజలందరికి న్యాయం చేకూర్చగలుగుతామని అది అతితొందరలోనే సంభవించి తీరుతుందని అందరికీ తెలుపుతూ వారిలో చక్కటి చైతన్యాన్ని రగిలించారు.

## సర్వసేనాధిగా చంద్రశేఖర్ ఆజాద్

తాము పేరుపెట్టి స్థాపించిన సంస్థకు కేంద్రసంఘ కార్య నిర్వాహక వర్గంగా భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుఖదేవ్, విజయకుమార్‌సిన్హా,





శివశర్మ, ఫణీంద్రనాధఘోష్, కుందన్‌లాల్‌లను ఎన్నిక చేసుకున్నారు. 'సంధానకర్త' గా అనగా 'సర్వసేనాధిపతి' గా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఒక్కొక్క ప్రాంతానికి ఒక్కొక్కరిని ఇన్‌ఛార్జిగా ఎన్నుకున్నాడు.

పంజాబుకు సుఖదేవ్, బీహారుకి ఫణీంద్ర, యు.పి.కి. శివశర్మ వంటివారిని ప్రాంతం వారీగా నియమించారు. అయితే అన్నీ ప్రాంతాల నుండి హాజరయిన విప్లవకారులలో చాలామందికి చంద్రశేఖర్ ముఖం తెలియదు. మరికొందరికి అతని గూర్చి, స్వభావం గూర్చి వివరాలు పూర్తిగా తెలియదు. భగత్‌సింగ్ ఆజాద్ గూర్చి సవివరంగా అందరికీ తెలియచెప్పి అతనికి గౌరవ, విశ్వాసాలను సంపూర్ణంగా కలుగచేశాడు.

ఒక వ్యక్తి ఎంత గొప్పవాడైనా అతడి పరిచయం చేసే విధానం ఎంతో ప్రభావితం చూపుతుంది. అంతటి పరిచయాన్ని భగత్‌సింగ్ చంద్రశేఖర్ యెడల నిర్వర్తించాడు. అయితే భగత్‌సింగ్ చెప్పిన దానికంటే వందరెట్లు చంద్రశేఖర్ ఆజాద్ విప్లవ సంస్థకు అంకితమయినాడని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు.

## ప్రేమతో కూడి బాధ్యతతో ఆజాద్

సమావేశాలు ముగిసిన అనంతరం చంద్రశేఖర్ ఆజాద్‌ను కలుసుకున్న ముఖ్య అనుచరులు సభావిషయాలను సంపూర్ణంగా వివరించాడు. తన ఎన్నిక గూర్చి వింటూనే ఆజాద్ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. తాను దేశము కోసం పాటుపడ్డాడే కాని ఎటువంటి అధికారాన్ని కోరుకోలేదు. అయితే అనేకమంది యోధులుండగా తనకు అత్యున్నత స్థానాన్ని ఇవ్వటం అతన్ని ఎంతో ఆనందింప చేయిగా, భగత్‌సింగ్ తనపై చూపిన అభిమానానికి, నమ్మకానికి మరింత ఆనందం సొంతం అయింది.

విప్లవకారులు తనపై పెట్టిన నమ్మకాన్ని పదిరెట్లు అధికంగా దేశంకొరకు కృషి చేస్తానని మనస్సులో మరింత గట్టిగా నిర్ణయాన్ని తీసుకున్నాడు. తనలోని చివరి రక్తంచుక్క కూడా దేశం కోసమే వెచ్చించడానికి చంద్రశేఖర్ ఆజాద్ ఎల్లప్పుడు సిద్ధమే.

అభిమానంతో అతడు చేసే కార్యక్రమాలు ఈ ఎన్నిక కారణంగా బాధ్యతతో కూడిన ప్రేమతో నిర్వహించబడేవిగా మారాయి. తాను చేసే పనులకు సంతృప్తితో పాటు వచ్చిన బాధ్యతకి అతడి అణువణువు పులకింతకు గురి అయ్యాడు.

## పెద్దలతో సత్సంబంధాలు - చాటుగా ఆయుధ సరఫరా

సర్వసేనాధిగా అధికారాన్ని స్వీకరించిన అనంతరం అతడు తన నివాసం ఝాన్సీలోనే సాగించాడు. ప్రతి వ్యూహాన్ని సాహసంతోటే పూర్తిచేశాడు. విప్లవకార్యాలు అభివృద్ధి కొరకు ఎంతో మంది రాజులు, సర్దార్లతో పరిచయాలు పెంచుకున్నాడు. కొన్ని వాటంతటవే ఏర్పడ్డాయి. అందరితో ఎంతో జాగ్రత్తగా మసలుకొనేవాడు. ఎంతో జాగ్రత్తగా అడుగువేసేవాడు.

అతడు వేసే అడుగులో నిజాయితీని మాత్రం సడలించేవాడు కాదు. పెద్ద మనుషులతో సత్సంబంధాలు వల్ల తమ సంఘ సభ్యులకు ఆయుధాలను చేర్చటం సులభంగా జరిగేది. ఆ పెద్దమనుషుల ఇంటిలో కొంతకాలం నివాసాన్ని ఏర్పాటుకూడా చేసుకునేవాడు.

ప్రభుత్వం వారికి ఏ పరిస్థితిలోనూ అతడిపై అనుమానం రాకుండా జాగ్రత్తపడేవాడు. పెద్దలతో ఏర్పరుచుకొనే స్నేహాలలో భాగంగా ఆజాద్‌కి ఒక సర్దారుతో పరిచయం ఏర్పడింది.

## ఆజాద్‌కు బెదిరింపు

ఆ సర్దారుకి అతడు కొలువున్న రాజుపై అమితమైన ద్వేషం, పగలు రగులుతుండేవి. ఆ రాజును అంతమొందించేందుకు పథకాలను వేసేవాడు. కానీ అవి విఫలమయ్యేవి. రాజుని చంపి ఆ జమీకి తానే జమీందారు కావాలనీ కాంక్ష అతడిలో ఉంది. అది రోజు రోజుకి పెరగసాగింది.

ఆ రాజును ఏ విధంగానైనా చంపాలనే ఉద్దేశ్యంతో అతడు రగిలిపోతున్న సమయంలో ఆజాద్‌తో పరిచయం ఏర్పడింది. కొద్ది సమయంలోనే ఆజాద్ ఆయుధాలను ప్రయోగించే విప్లవకారుడని అతడికి అవగతమైంది.

అతడి మెదడులో పథకం సిద్ధమైంది. ఆజాద్ ద్వారా ఆ పథకాన్ని అమలుజరిపి తను చిరకాలవాంఛను తీర్చుకోవాలనుకున్నాడు. కొద్ది సమయంలోనే అతడితో బాగా పరిచయాన్ని పెంచుకుని తన పథకాన్ని చెప్పి ఈ పథకం కనుక విజయం అయితే ఆజాద్ విప్లవసంస్థకు కావలసిన భారీ విరాళాన్ని ఇస్తానని చెప్పాడు.

అయితే ఆజాద్ తమకు సంబంధం లేని హత్యకు సహాయం చేయటం ఎంతమాత్రం ఇష్టం లేదని చెప్పినా అతడు ఒత్తిడి తేవటంతో పాటు బెదిరింపుకు సిద్ధమయినాడు.





## 'విప్లవానికి' మచ్చ తేకూడదు

ఈ విషయాన్ని ఆజాద్ విప్లవశాఖా సమావేశంలో తన మిత్రులకు తెలియచేసాడు. అయితే కొంతమంది ఆ విధంగా సహకరించటంలో ఎటువంటి తప్పులేదని ప్రోత్సహించితే మరి కొంతమంది మిన్నకుండిపోయారు. ఇటువంటి వాటికి సహకరించడం వల్ల సంస్థకు అవసరమైన విరాళాన్ని పొందవచ్చుని, లోగడ తాము కూడా చేసిన దాడులలో అమాయకులు బలయినారని, ఇది సర్వసామాన్యమని చర్చించసాగారు. ఎవరు ఎలా చెప్పినా చంద్రశేఖర్ ఆజాద్ మనస్సు ఇందుకు సహకరించలేదు.

విప్లవకారులు తాము చేసిన పనులలో అమాయకులు బలయినారని చెప్తుంటే అతని మనస్సు తీవ్ర మనస్తాపం చెందింది. ఉత్తమ సిద్ధాంతాలతో కూడిన సాయుధ విప్లవాన్ని చేబట్టిన విప్లవకారులు నియమాలను తప్పుతున్నారని గ్రహించాడు. దాని వలన హంతకులకు, విప్లవకారులకు తేడా ఉండదు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ఆజాద్ విప్లవ కారులందరిని సమావేశ పరిచి పరిస్థితిని వివరించుతూ "ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొన్న ఏ విప్లవ కార్యకర్త అయినా ప్రభుత్వానికి పట్టుబడి ఉరికంబానికి ఎక్కడానికయినా సిద్ధపడాలేగాని "విప్లవానికి" మచ్చ తేకూడదు.

ఎట్టి పరిస్థితులలోనూ అన్యాయానికి తలవంచకూడదు. అన్యాయం చేయకూడదు." అని ఖచ్చితంగా చెప్పి అందరినీ దగ్గరకు తీసుకొని ఏదన్నా సమస్యవస్తే దాన్ని మనస్సువిప్పి అందరితో చర్చించి నిర్ణయం తీసుకోమని చెప్పాడు. అంతటి నిష్కర్షతో అంతలోనే ప్రేమతో మాట్లాడిన ఆజాద్ అందరి మనస్సులను దోచుకున్నాడు. భగత్‌సింగ్ ఆజాద్‌కి ఓటు వేశాడు.

## ఆగ్రా కేంద్రంగా బాంబుల తయారీ

ఆ సమావేశంలో మరొక కీలక నిర్ణయాన్ని భగత్‌సింగ్, ఆజాద్‌లు తీసుకున్నారు. విప్లవసంస్థ ఆశయసాధనకు ముఖ్యమైనది ఆయుధం. అటువంటి ఆయుధాలను, మందుగుండు సామగ్రిని తామే తయారు చేస్తే ! ? ఈ ఆలోచన రావటము, అందరికీ వివరించటము, ఆచరణలోని అమలు జరుపడము రోజులలో జరిగిపోయింది.

భగత్‌సింగ్ కబురుతో చంద్రశేఖర్, సుఖదేవ్, బటుకేశ్వర దత్తు, శివశర్మ, జపదేవకాపూర్, డాక్టర్ గయా ప్రసాద్ వంటి సభ్యులు రహస్యంగా ఆగ్రా

చేరుకొని సమావేశమయ్యారు. వారి సమావేశంలో ఆగ్రానే బాంబుల తయారీకి సరైన ప్రదేశం అని నిర్ణయం జరిగింది. వెంటనే ఆగ్రాలో రెండు యిళ్ళను అద్దెకు తీసుకున్నారు. ఒక ఇంటిలో సభ్యులు ఉండే విధంగా, మరొక ఇంటిలో బాంబు తయారీ జరిగే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. ముడిపదార్థాలు, సాంకేతిక పరిజ్ఞానం చేరవేయబడగా బాంబుల తయారీకి సర్వం సిద్ధం కాసాగింది.

## ఓటమిని చవిచూసిన భగత్‌సింగ్ ఆజాద్‌లు

కొన్ని కారణాల కారణంగా విప్లవయోధుడైన యోగేశ్ చంద్రచటర్జీ ఆగ్రా జైలులో ఖైదీ అయ్యారు. అయితే బాంబుల తయారీకి పనులు జరుగుతున్న సమయంలో అతడిని ఆగ్రా జైలు నుండి మరొక జైలుకు మారుస్తున్నారని తెలిసింది. అతడిని తప్పించటానికి భగత్‌సింగ్, ఆజాద్‌లు రంగం సిద్ధం చేశారు. కానీ చివరి నిమిషంలో జైలు తరలింపు రద్దయినదనే విషయం తెలిసింది.

ఈ ఆపరేషన్‌లో పాల్గొనవలసిన విప్లవకారులంతా వారి ప్రదేశాలకు తిరిగివెళ్ళి పోయారు. అయితే త్వరలోనే యోగేశ్ చంద్రను జైలు మారుస్తారని తెలిసి తిరిగి రంగం సిద్ధమైంది. ఆగ్రా స్టేషను నుండి పోలీసులు యోగేశ్‌తో ఏడుగంటలకు బయలుదేరి రైలు ద్వారా కాన్పూరు చేరతారని తెలిసింది. భగత్‌సింగ్, ఆజాద్‌లు, మరికొంత మంది విప్లవకారులు రైలు ప్రయాణీకుల్లా ఆ రైలులోనే బయలుదేరారు.

అయితే యోగేశ్ చుట్టూ కాపలా విపరీతంగా ఉండటంతో విప్లవకారులకు ఏ మాత్రం అవకాశం చిక్కలేదు. అయితే భగత్‌సింగ్, ఆజాద్‌లు మాత్రం దాన్ని తమ అసమర్థతగా తీసుకున్నారు. ఈ బాధతో పాటు విపరీతమైన ఆర్థిక ఇబ్బందులు ఎదురవసాగాయి. ఏ పథకానికైనా డబ్బు అవసరం ఎక్కువగానే ఉంటుంది. రోజువారీ ఆహారానికి కూడా ఇబ్బంది ఎదురవసాగింది.

## ప్రభుత్వతొత్తులైన ధనికులపై, దుర్మార్గులపై దాడి

దాంతో కార్యనిర్వాహక సభ్యులంతా సమావేశమై పరిస్థితుల గూర్చి చర్చలు సాగించి ఏకగ్రీవ నిర్ణయాన్ని తీసుకున్నారు. రాజకీయ లక్ష్యాల కొరకు ప్రభుత్వాన్ని బలపరిచే ధనికుల్నీ, దుర్మార్గుల్నీ దోచుకోవాలని ముందుగా ఈ విధానాన్ని పల్లెలలో అమలు చేయాలని నిర్ణయించుకున్నారు. దుర్మార్గుల్ని దోచుకోవటంలో ఎటువంటి తప్పులేదని భావించారు.





ఈ దాడులలో పాల్గొనేవారి గూర్చి ఎవ్వరికి అర్థం కాకుండా ఉండటం కొరకు గుప్తనామాలను పెట్టుకున్నారు. దుర్మార్గుల్ని శిక్షించిన అనంతరం వారికి తాము చేసిన దుర్మార్గానికి ఇది శిక్ష అని తెలియచేయటం కూడా అవసరమని ఆజాద్ అందరికి హెచ్చరిక చేసాడు. దాడి జరిగిన సమయంలో ఎట్టి పరిస్థితులలోను ఏ అమాయకుడికిగానీ, బాధితుడికి గానీ, స్త్రీలకుగానీ హాని జరగకూడదు అని నిర్ణయం తీసుకున్నారు. అందరూ కలిసి వీటిని అమలు జరిపేందుకుగాను ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దళానికి నాయకుడిగా రాంప్రసాద్ బిస్మిల్‌ని ఎన్నుకున్నారు.

## హర్యానాకి ఆజాద్

విప్లవకారులంతా తిరిగి సమావేశమైనారు. దాడి చేసి ధనాన్ని సంపాదించే విధానం 'దోపిడీదారులే విప్లవకారులం' అని చెప్పుకుంటూ దోపిడి సాగించే అవకాశం కలగొచ్చునని ఆ మార్గాని వీడాలని నిర్ణయం తీసుకున్నారు. చర్చల సమయంలో విప్లవకారుడైన రామకృష్ణఖత్రీ అనే ఒక సాధువు ఉన్నాడు. ప్రస్తుతం ఇక్కడ డబ్బు సమస్య తీవ్రంగా ఉండటంతో ఆ సాధువు తనకు తెలిసిన ఒక విషయాన్ని తెలిపాడు.

హర్యానాకి చెందిన ఘాజీపూర్‌లో మహంత్ అనే ఒక మతగురువు వద్ద అపారమైన ధనం ఉంది. అయితే ఆయన దీర్ఘవ్యాధితో బాధపడుతున్న కారణంగా మరణానికి సిద్ధంగా ఉండటంతో తనకు నమ్మకస్థుడయిన శిష్యుడికి తన సంపదను అప్పగించాలనే నిర్ణయంతో ఉన్నాడు.

ఆయనకి ఇప్పటి వరకు ప్రియశిష్యుడు లభించలేదు. తమలో ఎవరైనా శిష్యుడిగా వెళ్ళి అతడి ప్రేమను, నమ్మకాన్ని పొందగలిగితే ఏ విధమైన హింసాప్రవృత్తి లేకుండా ధనాన్ని పొందవచ్చు. ఖత్రీ చెప్పిన విషయాన్ని అందరూ ఆమోదించి శాంతం, దయ, మానవత, త్యాగ పూరితమైన వ్యక్తితో పాటు సంస్కృతభాషలో పట్టు ఉన్న వ్యక్తి తమలో ఎవరున్నారా అని గమనించగా అందుకు తగిన వ్యక్తి 'చంద్రశేఖర్ ఆజాద్' అని భావించి అతన్ని వప్పించి హర్యానాకి పంపారు.

## మహంతు శిష్యుడిగా ఆజాద్

వ్యక్తిగత ఆశయాలున్నా సంస్థపురోగమనం కొరకు ఆజాద్ అందుకు అంగీకరించి హర్యానాలో సాధువు వద్దకు వెళ్ళి ఆయన్ని మెప్పించి శిష్యరికాన్ని

పొందాడు. మహంతు సిక్కుకావటంలో అతి తొందరగానే కష్టపడి గురుముఖి లిపి నేర్చుకున్నాడు. అయితే ఇక్కడ ఉండే సమయంలో ఎంతో మంది భక్తులు మహంతు దర్శనానికి వచ్చినప్పుడు బ్రిటీష్ అధికారుల కౄరకృత్యాల వల్ల తామెంత నరకం అనుభవిస్తున్నదీ చెప్పేవారు.

భారతీయులు పడే ఆవేదనను చూసి ఆజాద్ మనస్సు ఆవేశంతో రగిలిపోయేది. ఎంత తొందరగా భారతమాతని దాస్యశృంఖలాల నుండి విముక్తి గావించి భారతీయులకు మనశ్శాంతిని గలిగింపచేయగలమో అని పరిపరి విధాలుగా ఆలోచించేవారు.

అయితే మహంతు గురువు ఆరోగ్యం క్షీణించకపోగా రోజురోజుకి మెరగవసాగింది. దాంతో ఈ మార్గంలో ధనరాశుల విప్లవసమితికి లభిస్తాయే లేదో గాని తన నటన కొనసాగించటం అసాధ్యమని భావించి హర్యానా నుంచి తిరిగి ఆగ్రా చేరాడు.

## ఆజాద్ పై బిస్మిల్ నమ్మకం

తిరిగి ప్రత్యేక బృందం సమావేశం ఏర్పాటు అయింది. ఎవ్వరిని సంప్రదించకుండా చంద్రశేఖర్ మతాన్ని వీడటం నేరమని కొంత మంది ఆగ్రహాన్ని వ్యక్తం చేసినా కార్యవర్గసభ్యులు చంద్రశేఖర్‌ని సమర్థించారు.

ఈ సమావేశంలో రాంప్రసాద్ బిస్మిల్ ఒక విషయాన్ని ప్రతిపాదించి సంస్థ ఆశలూ లక్ష్యాలూ, కార్యాచరణాలనూ వివరంగా కరపత్రంపై వ్రాస్తూ దేశమాత సంకెళ్ళను తెంచటానికి ప్రతి భారతీయుడు తమతో సహకరించాలి అని విజ్ఞప్తిని చేశాడు.

ఈ విషయాన్ని కరపత్రాలపై ప్రచురించి వాటిని ఒకే రోజు వివిధ ప్రదేశాలలో బహిరంగంగా పంచాలని నిర్ణయం తీసుకొని ఆ బాధ్యతను ఎవరు స్వీకరిస్తారని అడిగాడు.

ఏ కార్యకర్తా ముందుకు రాలేదు. కొంత మంది బిస్మిల్‌తో ఆయన ఎవ్వరిని సూచించినా తాము ఆమోదాన్ని తెలుపుతామని చెప్పారు. ఒక నిమిషం మౌనం తరువాత రాంప్రసాద్ బిస్మిల్ "ఈ కర్తవ్య భారాన్ని నేను చంద్రశేఖర్ ఆజాద్‌కు అప్పగిస్తున్నాను."

అని ప్రకటించగా అందరూ ఆమోదించారు. రాంప్రసాద్ బిస్మిల్‌కి తనపై ఉన్న అపారమైన విశ్వాసానికి ఆజాద్ మనస్సులో కృతజ్ఞతలు తెలియ చేసుకున్నాడు.





## విజయవంతమైన పథకము

ఆ తర్వాత పథకం ప్రకారంగా చంద్రశేఖర్ ఆజాద్ నిర్వహణలో కరపత్రం ఒకే నిర్దిష్ట సమయంలో ఒకే రోజున అనేక పట్టణాలలో వేలకువేలుగా లక్షలమందికి అందచేశారు. ఆ కరపత్రాల్ని చూసి పోలీసు అధికారులు ఖంగుతినగా విప్లవనాయకులు, సంస్థ సభ్యులు ఆశ్చర్యానికి గురయ్యారు.

చంద్రశేఖర్ విజయవంతంగా నిర్వహించిన ఈ కార్యానికి బిస్మిల్ ప్రశంసలు అందచేసాడు. విమర్శకులైన విప్లవకార్యకర్తలు సైతం హర్షాన్ని వ్యక్తం చేశారు. అసాధారణమైన కార్యాన్ని ఎంతో చాకచాక్యంతో నైపుణ్యంతో ఆజాద్ నిర్వహించటం అభినందనీయమైంది.

## వీరవిహారం చేస్తున్న విప్లవం

అయితే సంఘాలుగా కాకుండా ఒక్కొక్కరుగా కూడా మహత్తర విప్లవ చర్యలను తీసుకుంటూ ప్రభుత్వాన్ని ఎదురించిన వైనాలు ఎన్నో ఉన్నాయి. ఉదా॥ అల్లూరి సీతారామరాజును చెప్పుకోవచ్చు. ఆయన బ్రిటీష్ అధికారులను గడగడ వణికించిన వైనం అందరికి విదితమైంది. ఇటువంటి మహావిప్లవ వీరులు ఎంతోమంది ఉన్నారు.

1922-30వ సంవత్సరాల కాలంలో విప్లవం వీరవిహారం చేసింది. బ్రిటిష్ పాలకవర్గం విప్లవాన్ని అంతమొందించాలని అమానుషమైన చర్యలు చేపట్టారు. అయితే విదేశాలలో భారతీయులు కూడా విప్లవకారులకు తమ సహకారాన్ని ధనరూపంలో, ఆయుధ రూపంలో అందచేసేవారు.

ఈ సహాయాలను ఉత్తర ప్రదేశ్‌లో విజయవంతంగా నడుస్తున్న హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీకి అందేవి. ఒక ఓడలో పెద్ద మొత్తంలో తుపాకీలు, పిస్తోళ్ళను వేరే పేరుపై పంపబడుతున్నట్లుగా జర్మనీ నుంచి వార్త చేరగా ఆ బాధ్యత రాంప్రసాద్ బిస్మిల్ పై పడింది. మారుపేరుతో వచ్చే ఆ ఓడలోని సామగ్రిని విడిపించాలంటే డబ్బు అవసరం చాలానే ఉంది.

## రైలులో దోపిడి చేసిన ఆజాద్ బృందం

బిస్మిల్ ముఖ్యులైన చంద్రశేఖర్ ఆజాద్ వంటి పదిమంది సభ్యులు, కొంతమంది విప్లవకారులతో ఎనిమిదిడౌన్ అనే రైలులో తీసుకురాబడుతున్న ప్రభుత్వ ధనాన్ని కొల్లకొట్టటానికి పథకాన్ని వేశారు. రైలులో అంతా సామాన్యులలా ఎక్కి నిర్జన ప్రాంతంలో చైను లాగి రైలు ఆపారు. బిస్మిల్,

ఆజాద్ వంటివారు జట్లుగా విడిపోయి ధనాన్ని సంచులలో పెట్టుకొని విడివిడిగా అనుకున్న ప్రదేశాలకు వెళ్ళిపోయారు. దోపిడి జరుగుతున్న సమయంలో ఒక సార్జెంటు, అయిదుగురు సాయుధ భటులు భయంతో దాగి ఉన్నారే కాని తమ కర్తవ్యాన్ని నిర్వర్తించటానికి ఏ మాత్రం ఆసక్తి చూపలేదు.

1925వ సం॥ ఆగష్టు 9న జరిగిన ఈ దోపిడి గూర్చి ఇండియన్ డెయిలీ టెలిగ్రాఫ్ 'కాకోరి' వద్ద భయానకమైన దోపిడి అనే శీర్షికతో ప్రచురించగా ప్రభుత్వం విప్లవకారులను జల్లెడవేసి పట్టటానికి సిద్ధపడింది. ఆజాద్ తదితరులంతా అండర్ గ్రౌండ్‌లోకి వెళ్ళిపోయారు. పోలీసులకు దోపిడీలో పాల్గొన్న ఒక్కరు కూడా చిక్కలేదు. అయితే లభించిన ధనం విప్లవ కార్యప్రగతికి వినియోగించే అవకాశం వారికి లభించలేదు.

## మారువేషాలలో ఆజాద్

అయితే కాకోరి దోపిడిని చేసిన వారంతా వివిధ రూపాల్లో వివిధ ప్రాంతాల్లో దాగితే ఆజాద్ తన మకాంను కొంత కాలం కాశీలోకి మార్చాడు. సెప్టెంబరు నెలకల్లా ఈ కేసులో అనుమానితులుగా అనేక మంది యువకులను పోలీసులు అరెస్టుచేసినా అసలు నిందితులు మాత్రం పట్టు బడలేదు. కాశీలో ఆజాద్ కొంతకాలం మాష్టర్ రుద్రనారాయణసింగ్ ఇంటిలో ఉన్నాడు.

ఆ ఇల్లు కళాకారులకూ, విప్లవకారులకూ, క్రీడాకారులకూ నిలయంగా ఉండేది. అయితే పోలీసులు అనుమానించడంతో తన మకాంను సాధువు వేషధారణలో అడవిలో సాతార్ నదీ తీరంలోనూ గడపసాగాడు. అక్కడ కూడా పోలీసుగస్తీ ఉంటుండటంతో ఝాన్సీలో మోటార్ క్లీనర్‌గా పనిచేసాడు. ఈ సమస్యను దాటి విప్లవకారు లందరిని సంఘటిత పరిచి కార్యక్రమాలను అమలు జరపాలని చంద్రశేఖర్ తపనపడేవాడు.

## ఆయుధాగారాల గూర్చి ఆచూకీ

అయితే ప్రభుత్వ యంత్రాంగం శ్రమ నెరవేరి కొంతమంది విప్లవకారులను బంధించటం, వారిని చిత్రహింసలు పెట్టడంతో కొంతమంది ప్రాణాలు విడిచినా మరికొంతమంది వారు దాచిన ధనం ఉన్న ఆయుధాగారాల గూర్చి చెప్పటం జరిగిందనే సమాచారం ఆజాద్‌కి అందింది.

దాంతో విప్లవకారులను ఆ సమయంలో సమావేశం కావించటం అసంభవం అనే విషయం గ్రహించి నెమ్మదిగా తన మకాంను బొంబాయికి





మార్చాడు చంద్రశేఖర్ ఆజాద్. అతడి హృదయం ఆ పరిస్థితులకు ఎంతో గాయం అయింది. భారత స్వాతంత్ర్యం గూర్చి ఎంతగా తపనపడుతుంటే పరిస్థితులు అంతగా వెనక్కి వెళుతుండటంతో అతడు వేదన చెందసాగాడు. కాకోరీ దోపిడి నేరం రాజకీయకుట్రగా చెబుతూ 24మందిపై లక్నోలో కేసు పెట్టింది ప్రభుత్వం.

## శిక్షకు గురిఅయిన విప్లవకారులు

చంద్రశేఖర్ ఆజాద్‌తో మరికొంత మంది విప్లవకారుల ఫోటోలను దేశంలో పలు ప్రదేశాలలో ఉంచి ప్రజలందరికి ఆ నిందితులను పట్టుకోవడంలో ఆశను చూపసాగింది బ్రిటీష్ ప్రభుత్వం. దాంతో ఆజాద్ తదితరులు మరింత గోప్యంగా ఉండసాగారు. చాలా కాలం బొంబాయిలో మురికి వాడల్లో ఉంటూ ఉదయం కూలీ పని చేసి సాయంత్రం ఆహారం తీసుకొని నిద్రపోవటం అదే దిన చర్యగా ఉండేది.

కోర్టులో ఉన్న కేసు విచారణ పద్దెనిమిది నెలలపాటు జరిగింది. ముద్దాయిల్లో ముఖ్యులయిన చంద్రశేఖర్ ఆజాద్, అష్ఫాక్ ఉల్లా, బక్షీలు ప్రభుత్వానికి దొరకలేదు. కేసును ప్రభుత్వవకీలు వాదనకు పూనుకొనగా, ముద్దాయిల తరుపున కొంతమంది జాతీయనాయకులు ఉచితంగా వాదించారు.

ఎవరు ఎంత ప్రయత్నం చేసినా విప్లవ వీరులకు మాత్రం కఠిన శిక్షలు తప్పలేదు. దేశమాతను దాస్యశృంఖలాల నుండి విడిపించటం కోసం విప్లవకారులైన వీరికి పడిన శిక్షలను చూసి భారతీయులంతా దిగ్భ్రాంతి చెందారు. మిత్రులని రక్షించుకోవాలని బయట నుండి విప్లవకారులు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి.

## ఉరిశిక్ష అమలు

రాంప్రసాద్‌బిస్మిల్, రాజేంద్రనాథలాహిరో, రోషన్‌సింగ్, అష్ఫాక్ ఉల్లాఖాన్‌లకు ఉరిశిక్షలు పడగా, శచీంద్రనాథ్ సన్యాల్‌కు దీపాంతరవాసం, మన్మదనాథ గుప్తాకు పధ్నాలుగేండ్ల కఠిన కారాగారం విధించారు. యోగేశ చంద్రచటర్జీ ముకుందలాల్, గోవింద చరణ్‌కర్, రాజకుమార్‌సింగ్, రామకృష్ణఖత్రీలకు పదేళ్ళ శిక్ష, భూపేంద్రనాథ్ సన్యాల్, రాందులారీత్రివేది, ప్రేమకృష్ణఖన్నాలకు అయిదేండ్లు, విష్ణుశరణ దుబ్లిష్, సురేంద్ర భట్టాచార్యులకు ఏడేళ్ళ శిక్షలను విధించారు.

కొంతమందికి అనారోగ్య కారణంగా విడుదల లభించింది. ముక్కు పచ్చలారని యువకులపై విధించిన ఉరిశిక్షకు దేశ ప్రజల నుండి తీవ్ర నిరసన వెల్లువెత్తింది.

మరణశిక్ష రద్దు చేయాలని కేంద్ర శాసనసభ్యులు పలువురి సంతకాలతో ఉన్న వినతి పత్రాన్ని వైస్రాయికి సమర్పించారు. వైస్రాయి ఉరిశిక్షను వాయిదా వేసారే కాని రద్దు చేయలేదు. కఠినాత్ములు, స్వార్ధచింతనతో ఉండే బ్రిటీష్ అధికారాన్ని బాధలూ, పోరాటాలూ కదిలించలేకపోయాయి.

1927వ సం॥ డిసెంబరు 17న బ్రిటీష్ వారి పాశవిక చర్యకు గుర్తుగా విప్లవ యోధుడైన రాజేంద్రలాహిరీ ఉరితీయబడ్డాడు. ఆ తర్వాత రాంప్రసాద్‌బిస్మిల్‌ను, గోరఖ్‌పూర్‌జైలులో, రోషన్‌సింగ్‌కు అలహాబాద్‌జైలులో, అష్ఫాక్ ఉల్లాఖాన్‌ను ఫైజాబాదులో ఒక సమయంలో డిసెంబరు 19వ తేదీన ఉరితీశారు.

మరణశిక్ష అమలు జరిపే సమయంలో విప్లవకారుల నోటివెంట వందేమాతరం, భారతమాతకు జై అనే నినాదాలు మారుమోగాయి. చంద్రశేఖర్ ఆజాద్ మారువేషంలో వీరి అంతిమ సంస్కార సమయంలో హాజరై బాధాతప్త హృదయంతో అభివందనాలనర్పించాడు.

## సైమన్ కమిషన్

భారతదేశం స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు వారి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. లాభనష్టాలనేవి ప్రతి పనిలో ఉండటం సాధారణమే.

వీరి పోరాటం రహస్యంగా జరిగింది. అయితే గాంధీజీ, లాలాలజపతి రాయ్, టంగుటూరి ప్రకాశం పంతులు వంటివారు ఎవరిదారుల్లో వారు బాహాటంగానే బ్రిటీష్ ప్రభుత్వంపై పోరాటాన్ని జరుపుతున్నారు.

భారతదేశంలో పరిస్థితులపై ఒక నివేదికను తయారుచేయటం కోసం ఒక కమిషన్‌ను భారతదేశానికి పంపుతున్నట్లుగా లండన్‌లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించింది.

దీనికి ఆధ్వర్యం వహిస్తున్నది సైమన్ దొర. అయినా ఈ కమిషన్‌లో ఏ భారతీయ ప్రతినిధి లేకపోవటంతో నివేదిక న్యాయంగా ఏర్పాటు అవదని భావించిన భారత నాయకులు ఆ కమిషన్‌కు సహకరించకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు.





## 'ఆంధ్రకేసరి' గా ప్రకాశం పంతులుగారు

సైమన్ కమిషన్ భారతదేశంలో అడుగు పెట్టటం ఆలస్యం భారతీయులు నల్లజెండాలతో వారికి ఎదురెళ్ళి 'గోబ్యాక్ సైమన్' అంటూ తమ నిరసనను తెలియచేసారు.

ప్రభుత్వం భద్రతా ఏర్పాట్ల కారణంగా వారు వివిధ ప్రదేశాలకు చేరగలిగినా బాహాటంగా రాలేని విధంగా ప్రజావెల్లువ నిరసనను వ్యక్తం చేసింది. మద్రాసులో ఈ సైమన్ సభ్యులకు నిరసనగా టంగుటూరి ప్రకాశం పంతులు ఆధ్వర్యంలో ప్రజలు సముద్రంలా ఉప్పొంగిపోయారు. మౌంట్ రోడ్డు మొత్తం నిరసనకారులతో నిండిపోయింది.

అయితే ఫోర్ట్‌సెంట్ జార్జ్ వద్ద ఉన్న రాష్ట్ర సచివాలయాల కోటకు దగ్గరలో ప్రజలకు పోలీసు యంత్రాంగం ఎదురు నిలిచింది. దాంతో ప్రజల గొంతులు 'గోబ్యాక్ సైమన్' నినాదాన్ని ముమ్మరం చేశాయి. వీరందరిని నడిపిస్తున్న ప్రకాశం పంతులుగారు జనవాహిని ముందు ఉండటంతో తెల్లసార్జెంట్ ఆయనపై దాడి చేశాడు.

ఏ మాత్రం భయపడని ప్రకాశంపంతులు గారు 'ధైర్యం ఉంటే నన్ను కాల్చండిరా' అంటూ రొమ్ము చూపిస్తూ ఎదురు నిల్వటంతో ప్రజలంతా ఒక్క పెట్టుగా ప్రకాశం పంతులుగారిని " ఆంధ్రకేసరి" జిందాబాద్ అని పిలువసాగారు. ఆ నినాదమే ఆయనకు బిరుదుగా ప్రదానం అయింది.

## తెరవెనుక ఉంటూ కాపాడే విప్లవకారులు

మద్రాసులో ఏ విధంగా సైమన్ కమిషన్ నిరసనను ఎదుర్కొన్నదో అదే విధంగా లాహోర్‌లోనూ ఎదుర్కొంది. అక్కడ లాలాలజపతిరాయ్ నాయకత్వాన్ని వహించి నిరసనను వ్యక్తం చేశారు.

ఈయన అప్పటికే పంజాబ్ కేసరిగా ప్రజల మన్ననలను అందుకొని ఉన్నాడు. స్వాతంత్ర్యంకోసం పోరాటం సల్పిన నాయకత్రయంలో లాలాలజపతిరాయ్‌ని ఒకరుగా చెప్పుకోవాలి.

అయితే ఇటువంటి పేరుగాంచిన నాయకులు నిర్వహించే నిరసన కార్యక్రమాలలో అంతర్లీనంగా తెరవెనుక ఉండి భగత్‌సింగ్, ఆజాద్ ప్రభృతులు వీరికి అన్ని విధాలుగా సహాయపడేవారు.

బాహాటంగా వీరు పోలీసుబలగాల నుండి కాపాడటంలో ముఖ్యపాత్ర వహించేవారు.

## దెబ్బతిన్న లాలాలజపతిరాయ్

పైనుంచి నిరసనకారులను కఠినంగా శిక్షించవలసినదిగా ఆర్డరు జారీ అవటంతో పోలీసుబలగాలు వీరిపై లాఠీలతో స్వైరవిహారానికి దిగారు. ఎంతో మంది అమాయక ప్రజలు వీరి లాఠీదెబ్బలకు బలయ్యారు. యువకుల తలలు పగిలి రక్తం కారసాగాయి.

పోలీసుల గురి లాలాలజపతిరాయ్ వైపే ఉంది. సమయం చూసి ఆయనను తెల్లఅధికారి గురిచూసి కొట్టాడు. లాలా గాయపడగానే ఆయన్ని పోలీసులు చుట్టుముట్టడానికి సన్నద్ధులవగా భగత్‌సింగ్ తదితరులు ఆయనకు రక్షణగా మారి ఆ దెబ్బలను కాచుకున్నారు. గొడవ గందరగోళం అవటంతో సైమన్ అధికార దళాన్ని పోలీసులు వేరే దారిగుండా వేరే ప్రదేశానికి పంపించివేశారు.

## 'లాలా' మరణం

ఆ తర్వాత లాలాలజపతిరాయ్ కోర్కెపై బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఆయన కంఠం కంచులా ఆ ప్రదేశమంతా మారుమ్రోగిపోయింది. గౌరవ మర్యాదలు తెలిసిన ఏ ప్రభుత్వం నిరాయుధులయినా ప్రజలపై దాడికి పూనుకోదు. ఇప్పుడు జరిగిన ఈ సంఘటన బ్రిటీష్ సామ్రాజ్య నిరంకుశత్వానికి ప్రతీక. ఇది ఎక్కువ కాలం సాగాదు. మనపై బడిన ఒక్కొక్క లాఠీదెబ్బ బ్రిటీష్ ప్రభుత్వ శవపేటికపై ఒక్కొక్క మేకుగా దిగబడితీరుతుంది. ఆయన మాటలకు ప్రజలంతా పెద్దపెట్టున హర్షాన్ని వ్యక్తం చేశారు.

బహిరంగంగా ఆయన వాక్యాలు పంజాబీయులనే కాకదేశభక్తులందరికీ స్ఫూర్తినీ, ధైర్యాన్నీ కలుగచేసి పోరాటానికి మరింతగా పురిగొల్పాయి. అయితే పోలీసు లాఠీదెబ్బలు ఆయన మనస్సుపై, శరీరంపై అధికప్రభావం చూపటంతో ఆయన 1928 వ సం।। 17వ తేదీన చికిత్స పొందుతూ మరణించారు. దేశమంతా ఈ మరణంతో ఉద్రేకపూరితమైంది. కసితో రేగుతున్న ఆజాద్ విప్లవసభ్యులతో సమావేశమై లాలాని ముట్టడించిన పోలీసులలో ముఖ్యఅధికారి 'సాండర్స్' అని నిర్ధారించుకుని అతడిని చంపటానికి రంగం సిద్ధం చేశారు.

## భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, రాజగురు

జయగోపాల్ వర్గం కార్యాన్ని అమలు చేయవలసి ఉంది. అనుకున్న సమయానికి జయగోపాల్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా సైకిల్ చెడిపోతే దాన్ని బాగుచేస్తున్నట్లుగా నటిస్తూ 'సాండర్స్' రాక కొరకు ఎదురుచూస్తున్నాడు.





స్టేషన్‌కి అతి దగ్గరలో ఉన్న కాలేజి వద్ద భగత్‌సింగ్, రాజగురు, ఆజాద్‌లు లోడ్ చేసిన పిస్తోళ్ళతో సిద్ధంగా ఉన్నారు. సాండర్స్ భోజనానికని మధ్యాహ్నం బయటికి వస్తాడని వారికి తెలుసు. అయినా నిర్ధారణకోసం జయగోపాల్ స్టేషన్ ఎదుట కాపుకాశాడు.

'సి.ఐ.సాండర్స్' స్టేషన్ బయటకు రాగానే ఆజాద్ ప్రభృతులకు సంకేతాన్ని అందచేశాడు జయగోపాల్. కాలేజి వద్దకు రాగానే భగత్‌సింగ్, ఆజాద్‌లు తలకు గురి చేసి పిస్తోల్ పేల్చగా సాండర్స్ అక్కడికక్కడే కిందపడి మరణించాడు. పిస్టల్ మోత వినపడిన పోలీసులు పరిగెత్తుకుంటూ రాసాగారు. దాంతో ఆజాద్ వారిని పారిపొమ్మని చెప్పి వారికి ఎదురునిల్చాడు.

భగత్‌సింగ్ తదితరులు వెళ్ళారని నిర్ధారించుకున్న అనంతరం వీరిని బెదిరించే ప్రయత్నంలో ఆజాద్ పిస్తోలు గుండుకి ఒక పోలీసు బలయ్యాడు. మిగిలిన వారు భయంతో వెనుదిరగగా ఆజాద్ అక్కడ నుంచి వేగంగా అదృశ్యమయ్యాడు. ఈ వార్తను జాతీయ పత్రికలు "లాహోర్‌లో లాలాలజపతిరాయ్ హత్యకు విప్లవకారుల ప్రతీకారం" అని దేశానికంతా చాటిచెప్పినాయి. విప్లవవీరుల ఆనందానికి అవధులు లేనేలేవు.

## హెచ్చరిక పత్రం విడుదల

విప్లవవీరులంతా మరింత ఉత్సాహంతో భారతీయులు నిర్వీర్యులుకారు అని ప్రపంచానికి చాటిచెపుతూ బ్రిటీష్ ప్రభుత్వానికి ఎర్రని కరపత్రంపై హెచ్చరిక చేశారు. "సామ్రాజ్య దాహంతో విర్రవీగుతూ అన్యాయాలనూ, దురాగతాలనూ, అక్రమాలనూ చేస్తున్న బ్రిటీష్ ప్రభుత్వానికి హెచ్చరిక.

నిరాయుధ పోరాటం చేస్తున్న ప్రజానాయకుడైన పంజాబ్ కేసరి లాలాలజపతిరాయ్‌ని కొట్టి చంపడం మానవాళికే అవమానకరం. మా నాయకునికి జరిగిన అన్యాయానికి ప్రతీకార చర్య 'సాండర్స్' హత్య. భారతీయులపై ఆయుధ నిషేధం ఉన్నా మా వద్ద ఉన్న ఈ చిన్న ఆయుధమే ప్రతీకారాన్ని తీర్చుకోగలిగింది.

ఇది సాయుధ విప్లవానికి సరిపోకపోయినా ఆ ఆయుధంతోటే అన్యాయంపై పోరాటం జరుపుతూ గుణపాఠాన్ని నేర్పుతూ విప్లవ పతాకం ఎల్లప్పుడూ ఎగురుతూనే ఉంటుంది.

జాతీ, నీతీ లేని మీ ప్రభుత్వం యొక్క ఉక్కుకోరలు నుంచి రక్తతర్పణం చేస్తూనే భారతమాతకు స్వాతంత్ర్యం తెచ్చిపెడతాము. అతినికృష్టమైన మీ పాలనా

విధానాన్ని ఎదిరించకపోవడము మానవత్వానికి ద్రోహం అవుతుంది. విప్లవం విజయం సాధించి తీరుతుంది.

విప్లవం వర్ధిల్లాలి, పరాయి పాలన నశించాలి.

కార్మికులంతా ఏకంకండి.

ఇంక్విలాబ్ జిందాబాద్.

ఈ కరపత్రం "హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ" పంజాబు ప్రాంతం నుంచి సేనాపతి బాలరాజ్ సంతకంతో 1928వ సం॥ డిసెంబరు నెల 18వ తారీకున విడుదల చేశారు.

## అలహాబాద్ చేరిన ఆజాద్ తదితరులు

అయితే 'సాండర్స్' హత్యతో చెలరేగిన బ్రిటీష్ ప్రభుత్వం ఆజాద్, భగత్‌సింగ్‌ల కోసం తీవ్రమైన గాలింపు మొదలు పెట్టడంతో ఆజాద్ తదితరులకు పంజాబ్‌లో మకాం అసంభవమయింది. ప్రభుత్వం సజీవంగా లేదా నిర్జీవంగా వీరిని పట్టుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది.

దాంతో ఆజాద్ ముఖ్యులు పంజాబ్ వదలాలని నిర్ణయించుకొని మారువేషాలలో బయలుదేరారు. ఒకరు సూటుబూటులో, మరొకరు మీసాలుతీసి యువకునిలా, మరొకరు నౌఖరులా బయలు దేరారు. రైల్వే స్టేషనులో అధికారి వీరిని తెల్ల దొరల్లా భావించి ఒంగి సలాములు చేస్తూ మార్గాన్ని చూపాడు. వారు విజయవంతంగా అమృతసర్ చేరుకున్నారు. అయితే అక్కడ నిఘా ఎక్కువగా ఉండటంతో పోలీసుల కళ్ళుగప్పి అలహాబాద్ చేరుకున్నారు.

## కార్మికుల సమ్మె

విప్లవం పుట్టింది బ్రిటీష్ ప్రభుత్వ నిరంకుశ విధానము వల్లనే. దేశ భక్తులైన అమాయక యువకులు కఠినాత్ములై విప్లవకారులుగా మారింది బ్రిటీష్ ప్రభుత్వపు పాశవిక దుశ్చర్యల కారణంగానే సంధికని పిలిపించి వీరుడైన అల్లూరి సీతారామరాజును చంపిన రాజనీతి బ్రిటీష్  వారికే చెందుతుంది. డివైడ్‌అండ్ రూల్ పద్ధతిలో విజయాన్ని సాధించి బ్రిటీష్ వారు భారతదేశంలోని మతకలహాలకు కారకులైయ్యారు.

కుటిలనీతి వారి రక్తంలో ఇమిడిపోయి ఉంది. ఎంతో మంది దేశ నాయకులను నిర్ధాక్షిణ్యంగా పొట్టన పెట్టుకున్నారు. అమాయక ప్రజలను చిత్రహింసలు పెట్టి బానిసలుగా ఉపయోగించుకున్నారు. ఎదురునిల్చిన వాడ్ని




నరికి చంపారు. వారి నిరంకుశ పరిపాలనకు అంతం అతి త్వరలోనే సంభవించి తీరుతుందని భారతీయుల ఆశ. ఆశయం కూడా వేగవంతం అవసాగింది. అయితే విప్లవకారుల ప్రతీకారాన్ని చవిచూసి బ్రిటీష్ యంత్రాంగం వారిపై నిఘాని ముమ్మరం చేసింది.

ఆ సమయంలో కార్మిక సమస్య తలెత్తింది. తామిస్తున్న దానితో తృప్తిపడి చెప్పినట్టు వినాలనే బ్రిటీష్ అధికారానికి ఎదురునిల్చి తమ కోర్కెలను తెలుపుతూ కార్మికులు సమ్మెకు నోటీసులు ఇచ్చారు. ఈ వివాదం పెద్దదవటంతో కార్మికులకు జాతీయనాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల మద్దతు లభిస్తే, బ్రిటీష్ యజమానులకు పెట్టుబడిదారుల మద్దతు లభించింది.

## పార్లమెంటుపై బాంబులతో దాడి పథకం

కార్మికుల సమ్మె ఉధృతం అవటంతో రెండు బిల్లులను బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించి వాటిని పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపచేయటానికి రంగం సిద్ధం చేశారు. అవి కుటిల బిల్లులని, అవే గనుక అమలు జరుపబడితే కార్మికులకే కాకుండా రాజకీయవాదులకు పెద్ద ఎత్తున అడ్డంకులు ఎదురవుతాయని ప్రముఖులు, విప్లవకారులు భావించారు.

సమావేశంలో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించినా ప్రభుత్వం ఆమోదించి శాసనాలుగా రూపొందించటం వాస్తవంగా జరిగే విషయం. విప్లవకారులంతా పార్లమెంటుపై బాంబులు వేసే బాధ్యతను భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్‌పై పెట్టారు.

పార్లమెంటులో బాంబులు వేసి కరపత్రాల్ని వెదజల్లి పారిపోయి రావాలని ప్రతిపాదించగా భగత్‌సింగ్ అందుకు అంగీకరించలేదు. తామిద్దరూ అరెస్టయిన పక్షంలో విప్లవ ఉద్యమాన్ని నడపటం ఇబ్బంది కలుగుతుందేమోనని ఆజాద్ బదులుగా బటుకేశ్వరదత్తుని నియమించాడు.

## పట్టుబడిన భగత్‌సింగ్, బటుకేశ్వర్‌దత్తులు

విప్లవకారులంతా పన్నిన పథకం తు.చ. తప్పకుండా అమలు పరచటానికి రంగం సిద్ధమైంది. పార్లమెంటులో 1929 వ సం॥ ఏప్రియల్ 8 వ తేదీన రెండు బిల్లులు ప్రవేశపెట్టడం చర్చ మొదలవటం, మహోద్రేకంతో సాగటం జరిగింది.

అయితే ప్రభుత్వ ప్రతినిధి వైస్రాయి ప్రత్యేకాధికారంతో ఈ రెండు బిల్లులను చట్టాలుగా భావించాలని విజ్ఞప్తి చేశారు. దాంతో ప్రజాప్రతినిధులంతా

వస్తూపోతుండగా సమయంకోసం చూస్తున్న భగత్‌సింగ్, బటుకేశ్వరదత్తులు డమ్మీ బాంబులను సభా భవనంపై వేశారు. సభా ప్రాంగణం దద్దరిల్లేలా బాంబులు ప్రేలి ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. అంతా ప్రాణభయంతో హాహాకారాలు చేస్తూ పరిగెత్తుతుండగా "విప్లవం వర్ధిల్లాలి... బ్రిటీష్ సామ్రాజ్యం నశించాలి" అంటూ భగత్‌సింగ్, బటుకేశ్వరదత్తులు నినాదాలు చేయసాగారు. గందరగోళంలో లోపలికి ప్రవేశించిన పోలీసులు వీరిని బంధించి న్యూఢిల్లీ జైలుకు తరలించారు.

## విప్లవకారుల గూర్చి గాలింపు

విప్లవకారులకు కావలసినది అనుకున్నది జరిగింది. అయితే విప్లవకారుల చర్యకి వీరిని పట్టుకోవడమే కాకుండా ముఖ్యపట్టణ ప్రాంతంలో మిగిలిన విప్లవకారుల కోసం గాలింపు తిరిగి మొదలైంది. అనుమానం ఏ మాత్రం వచ్చిన అక్కడ వీరంగం చేసేవారు పోలీసులు. ఎక్కడన్నా ఆచూకీ తెలిస్తే ఆ ప్రదేశంలో దాడి చేసి ఆయుధసామగ్రిని తగలపెట్టేవారు.

విప్లవకారులు తాము వేసిన బాంబు దాడికి తీవ్రమైన గాలింపు చర్య మొదలవుతుందని ముందే భావించే ఉండటంతో విప్లవ ప్రముఖులంతా తగిన జాగ్రత్తలు తీసుకొని భద్రమైన ప్రదేశాలలో ఉన్నారు. పోలీసులకు విప్లవకారులను ఏవిధంగానైనా పట్టుకొని రావాలని ఆర్డరు ఉండటంతో సూది మొనంత ఖాళీ స్థలాన్ని కూడా వదలకుండా గాలించసాగారు. పోలీసుల కష్టం ఫలించి ప్రముఖ విప్లవకారులైన సుఖదేవ్, కిశోరీలాల్‌లు లాహోర్‌లో పట్టుబడిపోయారు.

## విప్లవకారుల రహస్య సమావేశం

అయితే పార్లమెంటు భవనంలో బంధించిన భగత్‌సింగ్, బటుకేశ్వర దత్తులను లాహోర్ జైలుకు తరలించారు. వారిని విచారణ జరిపించటానికి తేదీ నిర్ణయించారు. వారిని తప్పించటానికి ఎటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయో కూడా వారికి తెలియదు. అయినా ధైర్యంగానే ఉన్నారు. వీరున్న ప్రదేశానికి బంధీలయిన సుఖదేవ్, కిశోరీలాల్‌ను తీసుకురాబడినారు.

పరిస్థితులు ఈ విధంగా ఉంటే విప్లవ సంఘం తిరిగి రహస్యంగా సమావేశమయింది. ముఖ్యులైన చంద్రశేఖర్ ఆజాద్, భగవతీచరణ్, యశపాల్, ధన్వంతరి వైశంపాయన్, దుర్గాబాబీ, సుశీలాదీదీ, అనే మహిళ విప్లవకారిణిలు కూడా సమావేశం అయ్యారు. ఎవరికి తోచిన విధంగా వారు పథకాలను తెలుపసాగారు. చర్చలనంతరం అందరి అభీష్టంతో ఒక పథకం రూపొందింది.





## స్త్రీల పై చంద్రశేఖర్ గౌరవం

విప్లవకారులుగా స్త్రీలను తమలోకి చేర్చుకోకూడదని చంద్రశేఖర్ గట్టి పట్టుదలతో ఉండేవాడు. అయితే ఆ తర్వాత కాలంలో కొన్ని సంఘటనల కారణంగా మార్చుకోవలసి వచ్చింది. క్రమంగా అతనిలో వచ్చిన మార్పుకి అంతా సంతోషించారు. మంచి పనికి తోడ్పడటానికి స్త్రీ, పురుష బేధం తేకూడదని భావించటం అలవరుచుకున్నాడు.

అయితే స్త్రీలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం ఎక్కువగా చంద్రశేఖర్ పైనే పడుతుండేది. ఆ సమయంలో అతడు చాలా ఓర్పుతో వారికి ఆయుధ ప్రయోగం విధానం గూర్చి, ఆయుధాల గూర్చి వివరించేవాడు. సౌమ్యంగా ఉండే అతడి సరళికి స్త్రీలలో ఆతడి పట్ల సోదర భావం వెల్లువయ్యేది.

స్త్రీలను తల్లితో సమంగా గౌరవించాలనేది చంద్రశేఖర్ భావన. మగవారికి తర్ఫీదు నివ్వటంలో ఎప్పుడైనా విసుగునీ, మొరటుతనాన్నీ ప్రదర్శించేవాడే కాని ఆడవారి పట్ల అత్యంత సౌమ్యంగా ప్రవర్తించేవాడు. స్త్రీల యెడల అసభ్యంగా ప్రవర్తించిన వారు మరణ శిక్షకు అర్హులని చెప్పేవాడు.

## బాంబుల తయారీ

మెరుపుదాడి పథకం ఉండటంతో దాడికి అవసరమయ్యే బాంబులు సిద్ధం చేయసాగాడు ఆజాద్. భగత్‌సింగ్, ఆజాద్‌లు నెలకొల్పిన ఆయుధాల తయారీ కేంద్రాల గూర్చి బ్రిటీష్ అధికారులకు తెలియడంతో ఆగ్రా, రోహటక్ కాన్పూరు మొదలగు ప్రదేశాలలో వాటిని ధ్వంసం చేయడం జరిగింది.

త్రికరణ శుద్ధితో, ఓరిమితో దీక్షాదక్షతతో పని చేసే ఆజాద్ బాంబులను రోహటక్‌లో దగ్గరుండి తయారుచేయించాడు. అయితే వీటిని పరీక్షించ దలచాడు. బాంబులు చేతిలో పేలకుండా డిప్పలకు వార్నిష్ పూతపూసి జాగ్రత్త చేశాడు. మందుగుండు సామగ్రితో బాంబుల తయారీ కన్నా వాటి భద్రతా వ్యవహారమే ముఖ్యంగా చూసుకోవలసినది. అయితే అనుకోకుండా ఈ బాంబు వల్ల విప్లవకారుడికే ప్రాణనష్టం సంభవించింది.

## బాధ్యతాయుతంగా ఆజాద్

యువకుడైన చంద్రశేఖర్ ఆకర్షణీయంగా ఉండేవాడు. సాధువుగా మారువేషంలో ఉన్న సమయంలో ఆజాద్ ఝాన్సీలో రుద్రనారాయణసింగ్ అనే మాస్టారు వద్ద ఉండేవాడు. ఆయన గొప్ప చిత్రకారుడు ఫోటోగ్రాఫర్ కూడా. ఆజాద్ ఎప్పుడూ తన పట్ల శ్రద్ధను చూపేవాడుకాదు.

స్త్రీలపై ఆకర్షణ కన్నా దేశంపై ఉన్న మమకారమే కోటిరెట్లు అధికంగా ఉండేది. యువకుడిలో ఉండే చిలిపిదనానికన్నా బాధ్యత ఎక్కువగా ఉండేది. అయితే రుద్రనారాయణకు విప్లవ వీరుడైన చంద్రశేఖర్ ఆజాద్ ఫోటోను తీసుకొని తన వద్దే ఉంచుకోవాలని ఆశపడేవాడు. అప్పట్లో చాలామంది విప్లవకారుల్లా ఆజాద్ గురించి తెలుసుకాని అతడి రూపం తెలీదు.

## ఆజాద్ ఫోటోను తీసిన రుద్రనారాయణసింగ్

ఆజాద్ రుద్రనారాయణ కోరికను గమనించి అతడికి ఏ మాత్రం అవకాశాన్ని ఇచ్చేవాడుకాదు. దాంతో రుద్రనారాయణ ఆజాద్‌కి చెప్పకుండా ఫోటోను తీయాలను అనుకున్నాడు.

ఒకరోజు ఆజాద్ స్నానం చేసి అంగవస్త్రం చుట్టుకొని లోపలికి వచ్చిన సమయంలో ఫోటో తీయటానికి సిద్ధపడ్డాడు. అయితే అనుకోని కారణం వల్ల ఆజాద్‌కి దొరికిపోయాడు. అయినా రుద్రనారాయణ మొండిగా ఈ రోజు నీ ఫోటో తియ్యకుండా వదలిపెట్టను అన్నాడు.

అతడి పట్టుదలకీ కోరికకూ ఆజాద్ ముఖంలో చిరునవ్వు విరిసింది. “అయితే నన్ను మీసాలు ఎక్కుపెట్టుకోనీ” అంటూ హుందాగా మీసాలన్ని సవరించుకొని చివరలను మెలికతిప్పసాగాడు. ఆ తర్వాత మాస్టారు కెమేరాను క్లిక్‌మనిపించారు.

అప్పుడు ఆయన తీసిన ఫోటోయే దేశానికి దక్కింది. చొక్కాలేని వస్తాదులా, సవాల్‌ని విసురుతున్న వీరుడిలా మీసాల్ని మెలివేస్తున్న ఆజాద్ ఫోటో జాతి గౌరవాన్ని అందుకుంది.

## ఓర్పు, సహనం కలిగిన ఆజాద్

ఏనాడూ బలహీనతలకు లోనవని ఆజాద్ బలహీనతలున్న వారిని అసహ్యించుకోవటం చేసేవాడుకాదు. వారిని మార్చాలని శతవిధాల ప్రయత్నించేవాడు. మాంసాహారాన్ని అస్సలు ముట్టుకునేవాడుకాదు. స్నేహితులంతా ఎన్ని సార్లు ప్రయత్నించినా ఓర్పుతో తిరస్కరించేవాడు. ఒకరోజున భగత్‌సింగ్ తదితరులంతా కలసి అతడు తినే కిచిడీలో మాంసం ముక్కలను కలిపి అతడికి పెట్టారు.

ఆ మాంసం ముక్కల్ని ఏరిపారవేస్తూ చిలిపితనంతో చేసిన వారి చేష్టల్ని ముద్దుగా తిట్టేవాడే కాని అన్నాన్ని పారవేసి చాదస్తంగా వ్యవహరించలేదు. అతడి ఓర్పునీ, సహనాన్నీ చూసి అంతా ఆశ్చర్యానికి గురయ్యేవారు. అయితే





ఎవ్వరూ కూడా అతడిలో దాగి ఉన్న రుద్రమూర్తిని చూడటానికి ఇష్టపడేవారు కాదు. బ్రిటిష్ వారిపై ఆతడు చూపే రౌద్రం, చాకచాక్యంతో నడిపే వ్యవహారం అందరికీ తెలిసిందే.

## కార్యనిర్వహణలో చాకచాక్యం

ఒకసారి చంద్రశేఖర్ మారువేషంలో ఢిల్లీ వెళ్ళవలసి వచ్చింది. పోలీసు ఇన్‌స్పెక్టరు వేషాన్ని ధరించి ఢిల్లీలో రైలు దిగాడు. అప్పటికే ఆజాద్ ఆ రైలులో వస్తున్నాడనే సమాచారాన్ని అందుకున్న పోలీసులు రైలు ఆగగానే ఆ రైలును చుట్టుముట్టి గాలించసాగారు. ఆజాద్ పట్టుపడటం తప్పదని భావించినా ఎటువంటి తొట్రుపాటుకు లోనుకాలేదు. ఎవ్వరినీ గమనించనట్లే చాలా మామూలుగా రైలు దిగి కూలీని పిలిచి సామాను ఎత్తించాడు. అయితే అతడి చేయి మాత్రం నిక్కరు జేబులో ఉంది.

అయితే ఆజాద్‌ను ఒక పోలీసు అధికారి గుర్తించాడు. నిర్ధారణ కోసం అతడి దగ్గరగా వచ్చాడు. ఆతడిని చూస్తూనే ఆజాద్ పెద్దగా నవ్వుతో చాలాకాలం తరువాత కలిసిన ఆప్తమిత్రుడిలా భుజంపై చేయివేసి దగ్గరకి తీసుకుని పిస్తోలుతో నొక్కిపెట్టి “మిత్రమా ! తొందరపడి అరవద్దు. క్షణంలో నీ ప్రాణం నా చేతిలో పోతుంది.

ఆ తరువాత మీ పోలీసులు నన్ను కాల్చుతారు. దానికంటే మనం ఎవరిపనులపై వారు వెళ్ళి ప్రాణాలతో మరికొంత కాలం బతుకుదాం” అని ఆ అధికారితోటే బయటకు వచ్చి టాటా చెబుతూ చాకచాక్యంగా తప్పించుకున్నాడు. పోలీసు అధికారి అతడి ధైర్యానికి చాకచాక్యనికి విస్తుపోయాడు. ఈ విషయాన్ని విన్న ఆజాద్ తోటి విప్లవకారులంతా పగలపడి నవ్వారు.

## కారు నిమిత్తం బస్తీకి వెళ్ళిన ఆజాద్

భగత్‌సింగ్, బటుకేశ్వర్‌లను తప్పించాలనే పథకంలో బాంబుల వినియోగంతో పాటుగా కారు అవసరం కూడా ఉండటంతో మంచి కారుని మాట్లాడటానికి బస్తీకి వెళ్ళవలసి వచ్చింది. వారు ఉంటున్న గ్రామం వద్ద ఉండే అడవిలోంచి బస్తీకి వెళ్ళవలసి ఉంది.

అయితే బాంబు ప్రయోగం అడవిలో జరపవలసి కూడా ఉండటంతో సుఖదేవ్, భగవతీచరణ్, వైశంపాయన్, ఆజాద్‌లు కలిసి రెండు బాంబులను

కూడా తీసుకొని బయలుదేరారు. సుఖదేవ్ బృందంను అడవిలోనే ఉండమని చెప్పి ముందుగా కారు కోసం బస్తీకి వెళ్ళాడు.

చంద్రశేఖర్ బాంబుల ప్రయోగ పరీక్ష అతడు వచ్చిన తరువాత చేయాలని అనుకున్నారు. రావి నదీ తీరం వద్దకు వచ్చిన సుఖదేవ్ బృందానికి బాంబులను తామే ప్రదర్శించితే సమయం కలసి వస్తుందనే ఆలోచన వచ్చింది. దాంతో మిత్రులు కొంతసేపు చర్చించుకొని బాంబుని పేల్చటానికే సిద్ధపడ్డారు. వీరిలో భగవతీచరణ్ బాంబును చేతిలోనే తీసుకొని విసరబోయాడు. కానీ ఆ బాంబు అతడి చేతిలోని ప్రేలిపోయింది. అతడు అంతెత్తు ఎగిరి అల్లంత దూరాన రాతి అంచుపై తగిలి కిందపడిపోయాడు.

## మరణం అంచుల్లో భగవతీచరణ్

వైశంపాయన్, సుఖదేవ్‌లు కూడా ఎగిరి దూరంగా పడిపోయారు. అయితే వైశంపాయన్‌కు కొద్ది గాయాలే అయినా సుఖదేవ్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. ఇద్దరూ కొంత బలాన్ని కూడగట్టుకొని లేచి భగవతీ చరణ్ కోసం చూడగా అతడు అక్కడికి దగ్గరలోని అతి భయంకరమైన పరిస్థితిలో కనిపించాడు.

రెండు చేతులు తెగిపడి రక్తం ముద్దలయ్యాయి. రాతికి గుచ్చుకొని కడుపులోని పేగులు బయటకు వ్రేలాడుతున్నాయి. బాధతో హృదయ విదారకంగా అరుస్తూ స్పృహను కోల్పోయే తరుణంలో అతిబలవంతం మీద “దాహం దాహం” అని అన్నాడు.

దాంతో వైశంపాయన్ నీరు కోసం రావినది వద్దకు పరుగెత్తాడు. సహాయం కొరకు సుఖదేవ్ గ్రామంలోకి వెళ్ళి విప్లవకారులతో విషయం చెప్పగా వారంతా సుఖదేవ్ విశ్రాంతి తీసుకోమని చెప్పి అడవిలోకి వెళ్ళారు. వారు సుఖదేవ్ చెప్పిన గుర్తు వద్దకువెళ్ళేసరికి వైశంపాయన్ భగవతీచరణ్‌కు దాహార్తిని తీర్చుతూ శుశ్రూషలు చేస్తున్నాడు. విప్లవకారులందరినీ చూస్తూనే భగవతీచరణ్ కన్నీరు కార్చుతూ “మీతో పాటుగా ఆజాద్‌ని చూసే అదృష్టానికి నేను నోచుకోలేదు.” అంటూ కన్నీరు కార్చాడు.

## మరణించిన వీరకిశోరుడు భగవతీచరణ్

భగవతీచరణ్ తనని రక్షించే ప్రయత్నాలను చేయబోతున్న స్నేహితులను చూసి వారిని వారిస్తూ నన్ను రక్షించే వ్యర్థ ప్రయత్నాన్ని మానండి. నేను మరణిస్తున్నాననే బాధకన్నా భగత్‌సింగ్, బటుకేశ్వర్‌దత్తులను విడిపించటంలో





భాగం పంచుకోలేకపోతున్నాననే బాధ నరకయాతనను పెడుతున్నది. ఈ మరణం వారిని విడిపించే ప్రయత్నంలో జరిగినా తృప్తిగా మరణాన్ని ఆహ్వానించేవాడిని.

భగత్‌సింగ్, దత్తులను విడిపించే పథకం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను. దేశానికి అతి త్వరలో స్వాతంత్ర్యం లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అతి ప్రయత్నంపై ఈ మాటలను పలుకుతూ ప్రాణాల్ని విడిచాడు. భగవతీచరణ్ మాటలను వింటూ వారంతా బాధాతప్త హృదయాలతో దుఃఖించారు.

తమ కర్తవ్యాన్ని మరింతగా గుర్తుకు తెచ్చిన అతడిని మనసులోనే అభినందించారు. ఆజాద్ వచ్చిన అనంతరం విషయాన్ని వివరించగా అతడి మనసు బాధకు గురయింది. అంతా కలసి అతడిని నదిలో వేసి అంజలిఘటించి జలసమాధి చేసి వెనుదిరిగారు.

## వ్యధతో చంద్రశేఖర్ ఆజాద్

భగవతీచరణ్ మృతి ఆజాద్‌పై తీవ్ర ప్రభావం చూపింది. భగవతీచరణ్‌తో అందరి సంబంధం వేరు, ఆజాద్ కున్న బంధం వేరు అందువలనే అందరిపైన కంటే ఆజాద్‌పై ఎక్కువ ప్రభావంచూపి మానని గాయం అయింది. ఆతడు ఆజాద్‌కి అత్యంతసన్నిహితుడు. ఎల్లప్పుడు ఉత్సాహంగా, ధైర్యంతో ఉండే అతడు ఏనాడూ వెనుకడుగు వేయలేదు. ఎక్కువగా అందరికీ ప్రోత్సాహాన్ని అందించాడు.

ఆజాద్‌కి మరీ దగ్గరవాడుగా ఉండటంతో కుడి భుజంగా వ్యవహరించే వాడనే చెప్పవచ్చు. అంతటి దగ్గరవాడు తాము తయారుచేసిన బాంబు కారణంగానే మరణించటం మనసుకి మరింత బాధని కలిగించింది అతను చనిపోయేటప్పుడు తనని చూడాలని ఆశపడిన విషయాన్ని మిత్రుల ద్వారా తెలుసుకొని ఎంతో వేదన చెందినాడు ఆజాద్. అతడు మరణించిన ప్రదేశంలో ఎంతోసేపు కదలకుండా కూర్చుండిపోయాడు. అందరూ వెళుతూ తనని రమ్మని చెప్పినా చాలాసేపు ఆ ప్రదేశాన్ని వదలటానికి ఇష్టపడలేదు.

## బొంబాయికి మకాం

అతిపెద్ద శబ్దంతో బాంబు పేలిన శబ్దంచుట్టు ప్రక్కల ప్రాంతం వారికి వినపడింది. ఆ వార్త నెమ్మదిగా పోలీసుల వద్దకు ప్రాకింది. అయితే ఆజాద్

బృందం కోసం గాలింపు చర్యలను చేస్తున్న పోలీసులు ఈ విషయం గూర్చి తెలుసుకుంటూనే అప్రమత్తులైయ్యారు. పోలీసులు నేరుగా అడవి ప్రాంతంలోని గిరిజనులపై పడ్డారు.

ఆజాద్ బృందం ఆచూకీ తెలపమని అందరిని చిత్రహింసలు పెట్టసాగారు. అడవికి దగ్గరలో రహస్య ప్రదేశంలో ఉన్న ఆజాద్ బృందానికి ఈ విషయం తెలిసింది. వారు ఈ సంఘటన జరుగుతుందని ఊహిస్తూన్నే ఉన్నారు. దాంతో ఆ ప్రాంతంలో ఇంకా ఉండటం క్షేమం కాదని గ్రహించి బొంబాయికి ప్రయాణం అయ్యారు.

## పృధ్వీసింగ్

బొంబాయిలో పోలీసులు విప్లవకార్యాచరణ కేంద్రాన్ని ధ్వంసం చేసి ఉండటంతో వీరి గురించి గాలింపుకూడా జరుగుతోంది. అప్పుడు వీరి సభ్యులలో తప్పించుకున్న పృధ్వీసింగ్ తర్వాత కాలంలో ఆజాద్‌కి తారసపడ్డాడు. పృధ్వీసింగ్ ముందరి కాలంలో గదర్ పార్టీలో ముఖ్యనాయకుడిగా వ్యవహారాలు నడిపి ఉన్నాడు. మంచి అనుభవం ఉన్నవాడు. ఎంతటి పరిస్థితులైనా చక్కబరచగలిగేవాడు. సహజంగా దృఢకాయుడు కూడా అవటంతో అవలీలగా అందరినీ ఎదురించగలిగేవాడు.

విప్లవ సంఘంలోకి రావటానికి ఆజాదే కారణం. ఒకనొక సందర్భంలో పృధ్వీసింగ్ ఒక పార్కులో ఆజాద్‌కి తారసపడ్డాడు. మాటలు కలవడంతో దీర్ఘంగా ఒకరిగూర్చి ఒకరు తెలుసుకున్నారు. అయితే వయసు చాలా తేడా ఉన్నా దృక్పధాలు ఒకటే. కానీ వారు పయనిస్తున్న మార్గాలు వేరు. అనుభవం, దీక్షాదక్షత ఉన్న తమ వంటి పెద్దలు విప్లవ సంఘంలో చేరి తగిన శ్రద్ధ చూపిస్తే ఎన్నోవేలమంది యువకులను సైనికులుగా రూపొందించవచ్చునని అన్నాడు.

## ప్రత్యేక న్యాయస్థానం

ఇప్పుడు ఆయన అవసరం తమకు ఉన్నదని భావించాడు చంద్రశేఖర్ ఆజాద్. తమ విప్లవశాఖా సభ్యులను ఆయనకు పరిచయం చేయటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆ తరువాత బొంబాయి నగరం సమీపంలో ఏర్పడి విప్లవశాఖలను పటిష్టం చేశాడు. ఆ తర్వాత అతడి దృష్టి యితర రాష్ట్రాల వైపుకు మరలింది.





ఇన్ని కార్యక్రమాలను పోలీసుల కళ్ళు గప్పి విజయవంతంగా నిర్వహిస్తూ మరొకవైపు భగత్‌సింగ్, బటుకేశ్వరదత్తుల గూర్చి వివరాలు తెలుసుకుంటూనే ఉన్నాడు. సమయం చూసి వారిని విడిపించటానికి ప్రయత్నం చేయసాగాడు. ఒకవైపు ఆజాద్ బృందం కార్యక్రమములు ఈ విధంగా జరుగుతుంటే వీరిని ఎదుర్కొంటూ పోలీసులు వివిధ వ్యూహాలను పన్ని విప్లవకారుల ఆచూకీని తెలుసుకుంటూ వారిని బంధించి రకరకాల అభియోగాలను మోపుతూ కోర్టులో హాజరుపరచసాగారు.

విప్లవకారులు ఎక్కువమంది నేరస్థులుగా దొరకటంతో ప్రభుత్వం ఏకంగా వీరి కొరకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఈ విషయం గూర్చి అనేక లక్షలు ఖర్చుచేయవలసి వచ్చింది. ప్రభుత్వం తరుపున విచారణ జరిపించటాన్ని అధికవ్యయాన్ని ఇస్తూ వకీళ్ళను కుదుర్చుకున్నారు. అయితే ముద్దాయిల పక్షాన ఎంతో మంది దేశభక్తులు ఉచితంగా విచారణ చేయటానికి ముందుకు వచ్చారు.

## అనూహ్యమైన ప్రజల స్పందన

న్యాయవిచారణ సమయంలో ట్రిబ్యునల్ కిటకిటలాడుతూ ఉండేది. ముద్దాయిల తరపున బంధువులేకాక దేశభక్తి వున్న ఎంతోమంది ఆసక్తితో వచ్చేవారు. భగత్‌సింగ్, బటుకేశ్వరదత్తులను విచారణా సమయంలో చూసినా చాలని తలంచుతూ వేలమంది గుమిగూడుతూ ఉండేవారు. పోలీసులు ఇటువంటి సమయంలో ఎన్నో జాగ్రత్తలను పాటిస్తూండేవారు. ఒక్కొక్కసారి జనాల్నించి ఏం వ్యతిరేకత వస్తుందో అనే భయంతో భగత్‌సింగ్, దత్తులను రహస్యంగా ట్రిబ్యునల్‌కి తీసుకువచ్చేవారు. వారి విచారణ గూర్చి ఎక్కువగా బయటకు పొక్కనిచ్చేవారుకాదు.

భగత్‌సింగ్, దత్తులు కోర్టులోకి చేతులకూ, కాళ్ళకూ సంకెళ్ళతోనే హాజరయ్యేవారు. ఏ సమయంలోనైన వారి మోము విజయగర్వహాసాలతో నిండిఉండేది. వారు కోర్టులోకి ప్రవేశిస్తూ 'విప్లవం వర్ధిలాల్లి' 'భారతమాతకుజై' అని నినాదాలిస్తుంటే అనూహ్యమైన స్పందన ప్రజలనుంచి లభించేది.

వారి నినాదాలు బ్రిటీష్ అధికారుల గుండెల్లో రైళ్ళను పరిగెత్తించేవి. 'విప్లవం' ప్రజల మనసుల్లో ఎంతటి స్థానాన్ని ఆక్రమించుకున్నదో చూస్తున్న ప్రభుత్వ అధికారులకు విప్లవం ఏ విధంగా ఇంతటి అభిమానాన్ని చూరగొందో అర్థం అయ్యేదికాదు.

## ప్రజలలో పాతుకుపోతున్న 'విప్లవం'

'స్వచ్ఛంధ సైనికులు' – ఇలా తయారవటానికి తాము ఫలానా అని చెప్పుకోవటమే ఒక అదృష్టంగా యువకులు మారసాగారు. ప్రభుత్వం విప్లవకారులను బంధించి కఠిన శిక్షలను ప్రజల కళ్ళముందే విధిస్తున్న విప్లవకారులుగా తయారవటానికి ఏ మాత్రం వెనుకంజ వెయ్యటం జరగటంలేదు.

విప్లవకారులుగా తయారవ్వటంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నా, ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొంటున్నా విప్లవంపై ఏ మాత్రం భీతి అనేది కలుగటంలేదు. ఒక్కొక్కసారి ఆకలితో అలమటించటం, తలదాచుకునే స్థలం కూడా దొరకక పోవటం జరిగినా దేశభక్తి ముందు ఇవన్నీ చాలా చిన్న కష్టాలుగా తోచేవి విప్లవకారులకు.

మహానాయకుల ఆధ్వర్యంలో తయారవుతున్న విప్లవకారులు మరింతగా ఉత్సాహపూరితులై దీక్షలలో పాల్గొంటున్నారు. కళ్ళముందే విప్లవకారులకు మరణశిక్షలు విధించబడుతున్నా ఏ విప్లవకారుడు వెనుకడుగు వెయ్యటం అనేది మచ్చుకయినా కనిపించేదికాదు.

## విప్లవకారుల ప్రధాన లక్ష్యంగా

విప్లవకారుల ప్రధాన లక్ష్యం "దేశ స్వాతంత్ర్యము". న్యాయమైన తమ కోర్కెను సిద్ధింపచేసుకోవటానికి తమ పరంగా ఏం మాత్రం అవకాశం లభించినా అదే ఒక అదృష్టంగా భావిస్తాడు. ప్రతి ఒక్క విప్లవకారుడు పెట్టుబడిదారుల విపరీత చర్యలకు అల్లాడుతున్న ప్రజలకు న్యాయం చేకూరుస్తారు. వారిని ధైర్యంగా ఎదుర్కొని వారి విధానాలను నాశనం చేయటమే కాక వీరి బారినపడకుండా ఉండటం కోసం ప్రజలలో చైతన్యాన్ని తేవటానికి అన్నివిధాలా కృషి చేసేవారు. సంఘటితంగా పోరాడితే ఎటువంటి బలవంతుడినైనా వంచగలమనే విషయాన్ని తెలియచేశారు.

విదేశీయులనే కాక దేశీయులైన అన్యాయపరులపై ప్రజలు తిరగబడే విధానాలను భోదించారు. ప్రజస్వామ్యాన్ని కాపాడటం, ప్రజలంతా కలసి స్వయంగా నిర్ణయాధికారాన్ని చేయటం విప్లవం బాటలో నడిచే విప్లవకారుల ప్రధాన లక్ష్యం. విప్లవసంఘ నాయకులు తమవంతు కృషిని జరిపారు. విప్లవకారులంతా దేశదాస్యవిముక్తిని కలిగించటానికి తమ చివరి రక్తం బొట్టును చిందించటానికి సిద్ధంగా ఉన్నామని బ్రిటీష్ ప్రభుత్వానికి తెలిపారు.





## కోర్టుకి మారువేషంలో ఆజాద్

చంద్రశేఖర్ ఆజాద్ తదితరులంతా ఈ విప్లవ సంఘ శాఖల్ని కోకొల్లలుగా పెంచటం కోసం అనంతమైన అవిశ్రాంతమైన శ్రమను పడ్డారు. ముందుచూపుగా భగత్‌సింగ్ తనతో పాటు బటుకేశ్వర్‌దత్‌ను పార్లమెంటుపై దాడికి సహాయకారిగా వేసుకోవటానికి కారణం చంద్రశేఖర్ వల్ల మరికొంత మంది విప్లవకారులు సమర్ధవంతంగా తయారవుతారనే భావం వల్లే.

ఆజాద్ తన బాధ్యతలను రహస్యంగా సమర్ధవంతంగా నెరవేరుస్తూనే మారువేషంతో భగత్‌సింగ్, దత్తుల విచారణ సమయంలో వెళ్ళాడు. మారువేషంలో కోర్టుకి హాజరై పరిస్థితులను పరిశీలించాడు. ప్రజలను పీడించే అధికారులెవరైనా తటస్థించితే వారిని దృష్టిలో ఉంచుకునేవాడు. ప్రజాపీడకుల్ని అధికారం నుంచి తొలగించేలా చేసి, శాసన నిర్మాణ అధికారాన్ని సామాన్యులకూ, రైతులకూ, శ్రామికులకూ కట్టబెట్టడమే విప్లవసంస్థల ముఖ్యమైన ఆశయం. వారి ఆశయాన్ని వారు నిజాయితీతో, దేశభక్తితో నెరవేర్చటానికి ప్రతి క్షణం ప్రయత్నిస్తూనే ఉన్నారు.

## విప్లవపంథా

విప్లవ మార్గంలో ఎన్నో అవకతవకలు హింసాప్రవృత్తులు ఎదురైనా విప్లవ పంథాను ఏ విప్లవకారుడు వదలలేదు. ఆ పంథాలోకి ప్రవేశించటానికి ఎంతో మంది యువకులు ఉత్సాహంగానే ముందుకు వచ్చారు.

స్వచ్ఛంధ సైనికులుగా దేశం కోసం పోరాడే వారి మార్గం బలవంతులనూ, దోపిడీదారులనూ హడలెత్తించింది. బలహీనులకు బలాన్నీ, ఉత్సాహాన్నీ పెంపొందించింది.

## వైస్రాయి కుటిలత్వపు ఆలోచన

విప్లవకారుల కొన్ని హింసాచర్యల కారణంగా వైస్రాయి అవకాశంగా తీసుకొని వైస్రాయి, అతడి బంట్రోతుదారులు లాహోర్, కాకోరీ, మీరట్ లలో జరిగిన సంఘటనల కారణంగా విప్లవకారులపై అనేక కుట్రకేసుల్లో ఇరికించి న్యాయవిచారణలు జరిపించుతూ శిక్షలు వేయిస్తున్నాడు.

ఫలితంగా ఎంతో మంది విప్లవకారులు మరణశిక్షలను అనుభవించారు. మరెంతో మంది కఠినశిక్షలకు పాత్రులయ్యారు. ఎంతమందిని పొట్టనపెట్టుకున్నా వాడికి ఆకలి తీరటంలేదు. అన్యాయంగా, కుటిలత్వంతో భగత్‌సింగ్,

బటుకేశ్వర్‌దత్తులను బలి తీసుకోవాలనే ఆలోచనను అమలుజరిపే ప్రయత్నం కోర్టులో అడుగడుగునా కనపడింది.

## వైస్రాయిని తుదిముట్టించాలనే ఆలోచన

పార్లమెంటుపై బాంబు దాడి కేసులో కోర్టు భగత్‌సింగ్, బటుకేశ్వర దత్తులకు శిక్షను విధించింది. అయితే ఆ శిక్ష వైస్రాయికి తృప్తినివ్వలేదు. వెంటనే వారిపై సాండర్స్ కేసు గురించి విచారణ పెట్టారు. దాంతో వారి ఆలోచన అర్థం అవటంతో ఆజాద్ రకరకాల పథకాలను వేస్తూ వీరిని తప్పించటానికి ప్రయత్నించాడు. అతని ప్రయత్నాలు విఫలం అవటమే కాక ఆ కార్యనిర్వహణలో ఎంతో మంది విప్లవకారులు తమ ప్రాణాల్ని కోల్పోయారు.

భారతదేశంలో ఎంతో క్రూరత్వంగా పాలనను సాగిస్తున్న వైస్రాయ్‌ని తుదిముట్టించాలని భావనచేశాడు. సమయం కోసం వేచి ఉన్నాడు ఆజాద్.

## భగత్‌సింగ్ తదితరుల మరణం

భగత్‌సింగ్ తదితరుల వల్ల వైస్రాయి ఇంగ్లాండులోని బ్రిటీష్ ప్రభుత్వం నుంచి అవమానాన్ని ఎదుర్కొన్నాడు. ఆ కారణంతో అసలే కర్కోటకుడైన వైస్రాయి మరింత కర్కశంగా మారి భగత్‌సింగ్‌పై కక్ష్యను పూని అతని మరణాన్ని కళ్ళతో చూస్తేనేగాని శాంతించలేననే ఆలోచనతో ఉడికిపోతున్నాడు. ఆ కారణంగానే మాములు బందోబస్తు కన్నా ఎక్కువ కాపలాను భగత్‌సింగ్, దత్తుల వద్ద నియమించాడు.

అందువల్లనే ఆజాద్ ప్రయత్నాలు వ్యర్థాలవుతున్నాయి కూడా. వైస్రాయిని చంపటానికి వేచి ఉన్న ఆజాద్ ఆచరణలో అమలు జరపాలని తేదీని నిర్ణయించాడు. కానీ ఈ లోపుగానే 1920 వ సం॥ అక్టోబరు 7వ తేదీన భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురులను “మరణించే వరకు ఉరితీయాలని” కోర్టు తీర్పును ఇచ్చింది. వారితో పాటు విప్లవకారులపై అన్యాయమైన ఆరోపణలు ఆరోపించబడుతూ చాలా మంది నాయకులకు యావజ్జీవ కారాగారశిక్షలు విధించారు.

విప్లవ వీరశేఖరుడైన భగత్‌సింగ్ తదితరులకు మరణశిక్షను అమలుపరుస్తూ ఉరి తీశారు. చంద్రశేఖర్ ఆజాద్ మానసిక స్థితి దయనీయంగా మారింది. మరొకవైపు విప్లవ సౌధ శిఖరాలను కూకటివేళ్ళతో కదిలించసాగింది బ్రిటీష్ ప్రభుత్వం. ‘సర్వసేనాపతి’ చంద్రశేఖర్ ఆజాద్‌ను ఏ విధంగానైనా





బంధించవలసినదిగా పోలీసులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశం వచ్చింది. ఈ సమయంలోనే పోలీసులకు వైశంపాయన్ చిక్కాడు.

## విఫలమైన హత్యా ప్రయత్నం

అయితే 1930 డిసెంబరు 29 వ తేదీన అనుకున్న ప్రకారంగా వైస్రాయ్‌పై హత్యా ప్రయత్నం చేశారు. దేశపర్యటనలో వైస్రాయ్ ప్రయాణం చేసే ప్రత్యేక రైలులో ప్రయాణిస్తూ పాతఢిల్లీ చేరుతుండగా రైలు పై బాంబులు వేశారు. అయితే వైస్రాయి ఉన్న పెట్టి తప్ప మిగతా రెండు పెట్టెలూ ధ్వంసం అయ్యాయి.

ఆతడు సురక్షితంగా గమ్యానికి చేరుకోగలిగాడు. షరా మామూలుగానే పోలీసులు విప్లవకారులపై కఠిన చర్యలు తీసుకోసాగారు. విప్లవసంస్థలు దెబ్బతినటంతో చంద్రశేఖర్ ఆజాద్ సంస్థ శాఖలను ఏ శాఖకాశాఖకు స్వాతంత్ర్యాన్నిచ్చి వారి కార్యక్రమాలను వారే నిర్వహించే అధికారాన్ని ఇవ్వడం మంచిదనుకున్నాడు.

## ప్రాంతాలవారీగా విప్లవ శాఖలకు అధికారాలనివ్వడం

ఈ విషయం గూర్చి చర్చకై 1930 వ సం॥ సెప్టెంబరు 4 వ తేదీన విప్లవసంస్థ సభ్యులను వివిధ ప్రాంతాల నుంచి సమావేశానికి హాజరవ్వాలని తెలిపాడు. సమావేశంలో వచ్చిన వారికి ఆయుధాలను ప్రాంతాల వారీ పంచి వారికి స్వేచ్ఛనిస్తూ వారే విప్లవ కార్యక్రమాలు జరుపుకోవాలి విప్లవం అభివృద్ధి కావటానికి కృషి సల్పాలని చెప్పాడు. వారికి ఇక కేంద్రం సంఘం ఉండదని, వ్యక్తిగా తన సాయం అడిగిన వారికి తప్పక లభిస్తుందని చెప్పాడు. అంతా ఈ పరిణామానికి బాధపడినా దేశపరిస్థితులు, చంద్రశేఖర్ పై ప్రభుత్వ అభియోగాలు చూచి మార్పు తప్పదని భావించారు.

ఆజాద్‌పై గాలింపు చర్య తీవ్రంకావటంతో అతడిని మరేదేశానికైనా కొంతకాలం వెళ్ళటం మంచిదని గట్టిగా చెప్పారు. అప్పటికే స్వేచ్ఛావిహంగం చేస్తున్న రష్యాకు వెళితే వారి పోరాట విధానం, పాలనా విధానాలను అవగాహన చేసుకున్నట్లుగా అవుతుందని కూడా చర్చించారు. అయితే ఆజాద్‌కి తనభద్రత కోసం పరాయి దేశం పారిపోవటం అనే విషయం అస్సలు నచ్చలేదు. మాతృదేశాన్ని పరాయి పాలన నుంచి విముక్తి గావించటానికి ప్రాణాల్ని అయినా అర్పించలేగాని విదేశంలో దాగటం తన వంటి వారికి తగదని చెబుతూ,

రష్యాలో ఆధునిక పరిపాలనను గమనించాడు. అక్కడి బోల్విక్ పోరాటం గూర్చి తెలుసుకోవడం మంచిదేనని దాని కొరకై యశ్‌పాల్ వెళ్ళటం సబబని ఖరారు చేస్తూ 1931వ సం॥ ఫిబ్రవరి 27న యశ్‌పాల్‌ని రష్యాకు పంపటానికి తేదీ నిశ్చయించారు.

## వెంబడించిన పోలీసులు

అయితే రష్యాకు బయలుదేరే ముందు రోజు యశ్‌పాల్‌కి అవసరమైన సామగ్రిని కొనటానికి సైకిల్ మీద బజారుకు వెళుతుండగా మార్గంలో ఆల్ఫ్రెడ్ పార్క్ వద్ద తనకు కొంత పని ఉందని తనని అక్కడ దింపి ఆతడిని బస్తీకి వెళ్ళి కొనుగోలు పూర్తిచేసుకొని యింటికి చేరమని ఆజాద్ అన్నాడు. పార్కు వద్ద ఆజాద్ దిగగా యశ్‌పాల్ బస్తీకి వెళ్ళిపోయాడు.

అయితే యశ్‌పాల్, ఆజాద్‌ను పోలీసులు గమనిస్తూ వెంబడిస్తూ ఉన్నారు. ఆజాద్ పార్కు లోపలకు వెళ్ళి ఒక చెట్టు నీడలో కూర్చున్నాడు. బయట పోలీసులు పార్కుని చుట్టుముట్టారు. క్షణంలో సాయుధులు లోపలికి రావటం ఆజాద్ వైపు గురిపెట్టి తుపాకీ కాల్చడం అది తొడలో దిగటం జరిగిపోయింది.

మనస్సులో ఏదో కీడు మెదలటం వల్ల తనని తాను హెచ్చరిక చేసుకొని లేచే లోపే ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. అయినా మెరుపులా లేచి తన వద్ద నున్న తుపాకీతో ఎదురుగా ఉన్న పోలీసుని కాల్చగా అతడి దవడ చీలిపోయింది. వెంటనే పోలీసులు దాడిని తీవ్రం చేస్తుండటంతో ఆజాద్ చెట్టు వెనుక వైపుగా వెళ్ళి పోరాటం చేయసాగాడు. అప్పటికే అతడి శరీరంలో గుండ్లు తలదాచుకొని ఉన్నాయి. శరీరమంతా రక్తంతో తడిసి ముద్దయి పోయింది.

## చంద్రశేఖర్ ఆజాద్ వీరమరణం

అంతటి స్థితిలోనూ ఎవ్వరి తోడు లేకపోయినా,మానసికంగా దెబ్బతిని ఉన్నా కూడా చంద్రశేఖర్ ఆజాద్ చిచ్చరపిడుగులా వీరవిహారం చేశారు. పోలీసులకి, ప్రత్యేక అధికారాలున్నా చంద్రశేఖర్ దగ్గరనించి కాల్చి చంపటానికి ధైర్యం చాలక దూరం నుంచే కాల్పులు జరుపసాగారు. ఆ గుండ్లను ఎదుర్కొంటూ ముప్పావువంతు పోలీసులను తుదముట్టించాడు. తాను చనిపోవటం ఖాయమనే విషయం ఆజాద్‌కు అర్థం అవుతూనే ఉంది. అయినా





చనిపోయేలోపల వీలయినంత మంది పోలీసుల్ని మట్టుబెట్టి దేశమాత రుణాన్ని కొంతయినా తీర్చుకుందామని భావించాడు. మాతృదేశాన్ని పరాయి పరిపాలన నుంచి తప్పించలేకపోయాననే వాస్తవం అతడి కన్నీళ్ళ రూపంలో



ప్రవహించసాగింది. కసితో, బాధతో అతడి శరీరం అదుపు తప్పి ఊగిపోసాగింది. శరీరంలో మారుమూల దాగి ఉన్న ఓపికను అంతకుమించి దేశభక్తిని పైకి తెచ్చుకుంటూ పోలీసులకు తాను మరణించే వరకు పట్టుబడననే తన శపధాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ పోరాటం సాగించాడు. పరిస్థితి చేజారిపోయిందని గుర్తించి ఆఖరి గుండును తన కణతకు గురిపెట్టుకున్నాడు. బ్రతికి ఉండగా పట్టుకొలేరనే శపధాన్ని నెరవేర్చు కున్నాడు. యవ్వనం కూడా సంపూర్ణంగా అనుభవించని ఒక ఇరవై అయిదేండ్ల వీరతేజం తన తేజస్సును కోల్పోయింది. వీరాగ్రేసరుడిగా విప్లవజ్యోతిగా, విప్లవసేనానిగా 'ఆజాద్'గానే అతడు వీరమరణాన్ని పొందాడు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరాధివీరుడిగా భారతదేశ ప్రజల హృదయాలలో స్థానాన్ని సంపాదించుకున్నాడు చంద్రశేఖర్ ఆజాద్.

---- ---- -------